ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 13, ఏప్రిల్ 2025

ప్రభలతీర్థం

చీమకుర్తి మండలం రామతీర్థంలోని గంగమ్మతల్లి తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. జిల్లాతోపాటు పొరుగు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి ఆలయ సమీపంలో ఆరు విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేశారు. వీటిపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హీరోయిన్ అనన్యతోపాటు పలువురు ప్రముఖ సినీ, టీవీ కళాకారులు సందడి చేశారు.

- వివరాలు 8వ పేజీలో





ఆనందంతో కేరింతలు కొడుతున్న ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యార్థినులు



ఒంగోలులో సంబరాలు చేసుకుంటున్న శ్రీప్రతిభ విద్యార్థినులు

మెరుగైన ఫలితం

- ద్వితీయ సంవత్సరంలో 79శాతం.. ప్రథమ సంవత్సరంలో 63శాతం మంది పాస్
- రాష్ట్రస్థాయిలో మాత్రం వెనకే

ఇంటర్‌లో గతేడాది కన్నా అధిక ఉత్తీర్ణత

జిల్లాలో బాలికలు టాప్

ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు దుమ్ములేపారు. గతేడాది కంటే ఈ ఏడాది అధిక ఉత్తీర్ణత సాధించారు. బాలుర కంటే బాలికలు పైచేయి సాధించి భళా అనిపించారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 79శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో 16వ స్థానంలో, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 63శాతం పాసై 19వ స్థానంలో నిలిచారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు రెండింటిలోనూ రాష్ట్ర సగటు కంటే తక్కువ ఉత్తీర్ణతతో జిల్లా వెనుకంజలో ఉంది.

ఒంగోలు విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో శనివారం విడుదలైన ఇంటర్ ఫలితాలలో జిల్లా విద్యార్థులు మెరుగుపడ్డారు. ద్వితీయ సంవత్సరంలో రాష్ట్రంలో సగటున 83శాతం మంది ఉత్తీర్ణులు కాగా జిల్లాలో మాత్రం 4శాతం తక్కువ ఉత్తీర్ణతతో 79శాతం మంది మాత్రమే పాసయ్యారు. జిల్లాలో 16,236 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 12,863 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు సగటున 80శాతం, బాలికలు సగటున 86శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విద్యార్థులు, జనరల్ విద్యార్థుల కంటే ఆరుశాతం తక్కువగా 73శాతం మంది

మిగతా 8వ పేజీలో

డొంక పోరంబోకు భూమికి ఆక్రమణదారులు వేసిన కంచె



భూ చోళ్లు

ముక్తినూతలపాడు సర్వే నెం.15లో డొంక పోరంబోకు ఆక్రమణ

కోర్టు వివాదంలో ఉన్న 5.6 ఎకరాలకు ఎసరు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. ఖాళీ స్థలం కనిపిస్తే 'భూ'చోళ్లు కాజేస్తున్నారు. తాజాగా ఒంగోలు సమీపంలోని ముక్తినూతలపాడు సర్వే నంబర్ 15లో ఉన్న డొంక పోరంబోకుపై కొందరి కన్నుపడింది. ఏకంగా 20.60 ఎకరాల భూమికి ఎసరు పెట్టారు. శుక్రవారం రాత్రి 5.6 ఎకరాలను ఆక్రమించారు. రూ.కోట్ల విలువ చేసే భూమికి కంచె వేశారు. వివరాల్లోకెళితే.. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని ముక్తినూతలపాడు సర్వే నెం.15లోని భూమి రెవెన్యూ రికార్డులలో డొంక పోరంబోకుగా ఉంది. అయితే ఆక్రమణదారులు కొందరు వ్యక్తుల వద్ద కొనుగోలు చేశామంటూ కథ అల్లారు. ఇదిలా ఉంచితే 1978లో ఈ స్థలంలో కొందరు

మిగతా 8వ పేజీలో



పీసీ పల్లి మండలం కమ్మవారిపల్లెలో వేపచెట్టు విరిగిపడడంతో తెగిపోయిన విద్యుత్ తీగలు

ఇటు భగభగలు.. అటు వడగండ్లు

- పలుచోట్ల 42 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదు
- సాయంత్రానికి చల్లబడి జల్లులు
- ఎండలు మరింత ముదిరే అవకాశం

8లో

మెరుగైన ఫలితం

(7వ పేజీ తరువాయి)

మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో ఒకేషనల్ విద్యార్థులు 1,540 మంది పరీక్షలకు హాజరు కాగా 1,168 (73శాతం) మంది పాసయ్యారు.

ప్రథమ సంవత్సరంలో 63శాతం

ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 63శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. జనరల్ విద్యార్థులు 18,715 మంది పరీక్షకు హాజరు కాగా 11,798 మంది పాసయ్యారు. రాష్ట్రంలో 19వ స్థానంలో నిలిచారు. ఒకేషనల్ విద్యార్థులు 1,629 మంది పరీక్షకు హాజరు కాగా 913 మంది పాసై 56 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో బాలుర కంటే బాలికలే అధికమంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ యాజమాన్యంలో 75.3శాతం

ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యంలోని జూనియర్ కళాశాలల్లో వివిధ మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, హైస్కూలు ప్లస్‌లు, ఎయిడెడ్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్, ఏపీటీడబ్ల్యూఆర్‌ల్లో విద్యార్థులు సగటున 75.3శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యార్థులు మొత్తం 3,346 మంది పరీక్షకు హాజరు కాగా 2,516 మంది పాసయ్యారు.

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,761 మంది పరీక్షకు హాజరు కాగా 1,314 మంది (68.2శాతం) పాసయ్యారు.
- ఏపీ మోడల్ స్కూళ్లలో 391 మందికి 317 మంది (81.1శాతం) ఉత్తీర్ణులయ్యారు.
- హైస్కూలు ప్లస్‌లో 110 మందికి 62 మంది (56.4శాతం)పాసయ్యారు
- కేజీబీవీల్లో 450 మందికి 346 మంది (76.9శాతం) ఉత్తీర్ణులయ్యారు.
- ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 527 మందికి 510 మంది (96.8శాతం) పాసయ్యారు.
- ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 57కు 51మంది (89.5శాతం) ఉత్తీర్ణులయ్యారు.
- ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో 45మందికి కేవలం 20మంది (44.4శాతం) మాత్రమే పాసయ్యారు.

ప్రథమ సంవత్సరంలో 54.8శాతం

ప్రభుత్వ విద్యాసంస్థలకు సంబంధించి ప్రథమ సంవత్సరం పరీక్షలకు 4,343 మంది హాజరు కాగా 2,379 మంది (54.8శాతం) పాసయ్యారు. ప్రభుత్వ బాలికల కళాశాలల్లో 2,118 మందికి 977 మంది (46.1శాతం) ఏపీ మోడల్ స్కూళ్లలో 429 మందికి 281 మంది (65.5శాతం), హైస్కూల్ ప్లస్‌లో 224 మందికి కేవలం 53మంది (23.6శాతం) పాసయ్యారు. కేజీబీవీలో 691 మందికి 395 మంది (57.2శాతం), ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌లో 679 మందికి 584 మంది (86శాతం), ఏపీటీడబ్ల్యూఆర్‌లో 80 మందికి 42 మంది (52.5శాతం), ఎయిడెడ్‌లో 122 మందికి 47 మంది (38.5శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ద్వితీయ సంవత్సరం వివరాలు

ఏడాది	పరీక్షకు	పాసైనవారు	ఉత్తీర్ణత శాతం	రాష్ట్రంలో స్థానం
2019	26,333	14,336	54	10
2020	27,586	14,885	54	9
2021	31,760	31,760	100	-
2022	27,958	14,272	51.1	6
2023	28040	11,900	48.8	10
2024	20,278	11,900	58.7	18
ప్రథమ సంవత్సరం				
2019	23,481	15,883	68.0	9
2020	23,590	13,956	59.0	7
2021	29,897	29,897	100	-
2022	22,567	16,136	58.5	6
2023	25,461	16,259	63.86	7
2024	17,239	12,366	71.7	15

తొమ్మిది ప్రభుత్వ కళాశాలల్లో 100శాతం ఉత్తీర్ణత

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో తొమ్మిది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించి సత్తాచాటాయి. తాళ్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, త్రిపురాంతకం, అర్ధవీడు, దోర్నాల, పామూరు కేజీబీవీలు, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం కొండపి, దర్శి, చీమకుర్తి కళాశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించి అగ్రభాగాన నిలిచాయి. త్రిపురాంతకం 98శాతం, అర్ధవీడు 90శాతం ఉత్తీర్ణత సాధించగా దోర్నాల ఏపీ మోడల్ స్కూళ్లలో 96.9శాతం, దర్శి మోడల్ స్కూలు 87.5శాతం, పాకల హైస్కూలు ప్లస్ 90శాతం, కె.ఉప్పలపాడు హైస్కూలు ప్లస్ 87.5శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఒక్క కళాశాలలోనూ వందశాతం ఉత్తీర్ణత సాధించలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలు దోర్నాల 76.5శాతం, అర్ధవీడు 76.3శాతం, త్రిపురాంతకం 76.2 శాతం, ఏపీమోడల్ స్కూలు రాచర్ల 81.8, దోర్నాల 80.7శాతం, హైస్కూలు ప్లస్ కె.ఉప్పలపాడు 80.0, పాకల 62.5శాతం, కేజీబీవీల్లో పుల్లలచెరువు 83.7, త్రిపురాంతకం 77.4, సీఎస్‌పురం 72.4, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల్లో కొండపి 98.7, దర్శి 97.8, అర్ధవీడు 97శాతం ఉత్తీర్ణత సాధించాయి.

'భూ'చోళ్లు

(7వ పేజీ తరువాయి)

మాజీ సైనికులకు పట్టాలు ఇచ్చారని కొంతమంది వెల్లడిస్తున్నారు. వారు ఎవరో.. ఎక్కడ ఉంటారో కూడా తెలియని పరిస్థితి. మరికొందరు భూమిని తమ స్వాధీనంలో ఉంచుకోగా, మిగిలిన 5.6 ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలో ఉంది. దీంతో దళిత సంఘ నేత ఒకరు 2009లో డొంక భూమి ప్రభుత్వ పరిధిలో ఉందని, అందులో ఎస్సీ, ఎస్టీలకు స్థలాలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అప్పటి రెవెన్యూ అధికారులు అది వీలుపడదనడంతో దళిత నేత కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఆ వివాదం కోర్టులో నడుస్తోంది. దళితనేత మరణించడంతో కేసు నెమ్మదించింది. దీంతో ఆ భూమిపై కన్నేసిన కొందరు తమకు పట్టాలు ఉన్నాయని, వాటిని కొందరు వ్యక్తుల వద్ద కొనుగోలు చేశామని చెబుతూ కంచె వేస్తున్నారు. ఇదే విషయమై రెవెన్యూ అధికారులతో మాట్లాడగా, ప్రస్తుతం 5.6 ఎకరాల భూమి విషయం కోర్టులో వాదనలు నడుస్తున్న మాట వాస్తవమేనన్నారు. అయితే గతంలో మాజీ సైనికులకు పట్టాలు ఇచ్చారని కొందరు అంటున్నారని, అందుకు సంబంధించి ఎలాంటి రికార్డులు తమ వద్ద లేవని వెల్లడిస్తున్నారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో చైత్ర పౌర్ణమి, హనుమద్విజయోత్సవం సందర్భంగా శనివారం లక్ష తమల పాకుల పూజ వైభవంగా జరిగింది. సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. వేదపండితులు, పూజారులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకులతో ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయ దాతలుగా చిలకలూరిపేటకు చెందిన డీఆర్ ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. శనివారం, హనుమద్విజయోత్సవము కలిసి రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ప్రసన్నాంజనేయున్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

కుటుంబ కలహాలతో చేయి కోసుకున్న వ్యక్తి

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి చేయి కోసుకున్న ఘటనల అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గరటయ్య కాలనీకి చెందిన సంజీవరావు శనివారం చేయి కోసుకున్నాడు. 108 సిబ్బంది సంజీవరావును అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం సంజీవరావు కమలేశ్వరస్వామి దేవాలయం సమీపంలో నామ్ రోడ్డు వెంబడి పడుకొని ఉండడంతో స్థానికులు 108 కు సమాచారం అందించారు. వెళ్లి చూడగా సంజీవరావు కావడంతో 108 సిబ్బంది వెనుదిరిగి వచ్చారు.

భక్తజనసంద్రం రామతీర్థం

- తిరునాళ్లకు పోటెత్తిన ప్రజలు
- అలరించిన ఆరు విద్యుత్ ప్రభలు
- పొంగళ్లు పెట్టి మొక్కుబడులు చెల్లించిన భక్తులు
- ప్రభలపై సినీ, టీవీ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు



పూజలందుకుంటున్న గంగమ్మతల్లి

భక్తుల పూజలు

చీమకుర్తి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి) : రామతీర్థం గంగమ్మతల్లి జాతర అదరహో అనిపించింది. జిల్లా నలువైపులతో పాటు పక్క జిల్లాల నుంచి సైతం భారీగా తరలివచ్చిన భక్తులతో రామతీర్థం జనసంద్రంగా మారింది. శనివారం ఉదయం నుంచే ఆలయంలో విశేష పూజలు మొదలయ్యాయి. భక్తులు పెద్దఎత్తున తమ మొక్కుబడి పొంగళ్లు చెల్లించారు. సంప్రదాయబద్ధంగా, వంశపారంపర్యంగా వస్తున్న ఆచారం ప్రకారం గోగినేని సుధాకర్, దారపునేని వెంకట్రావు, కోయి రమేష్ కుటుంబసభ్యులు తమ మొక్కుబడి పొంగళ్లు చెల్లించారు. విద్యుద్దీపాలంకరణతో ఆలయ ప్రాంగణం కాంతులీనింది. రాత్రివేళ ఆలయ సమీపంలో ఆరు విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేశారు. తెలుగుదేశం పార్టీ తరపు నుంచి నాలుగు, జనసేన, వైసీపీ నుంచి ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేసిన మొత్తం ఆరు విద్యుత్ ప్రభలపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా అలరించాయి.

టీడీపీ విద్యుత్‌ప్రభపై ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, వైసీపీ ప్రభపై జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. జనసేన నాయకులు సైతం ప్రభపై ఎక్కి ఉత్సాహపరిచారు. హీరోయిన్ అనన్యతోపాటు పలువురు ప్రముఖ సినీ, టీవి కళాకారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దాదాపు 200మందికిపైగా పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠమైన బందోబస్తు నిర్వహించారు.



ప్రభపై డ్యాన్సర్ల సందడి

ఇటు భగభగలు.. అటు వడగండ్లు..!

- పలుచోట్ల 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదు
- సాయంత్రానికి చల్లబడి జల్లులు
- మరింతగా ఎండలు పెరిగే అవకాశం

ఒంగోలు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం భానుడు భగభగ మండాడు. పలుచోట్ల 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలకు తోడు వేడిగాలులు కూడా మొదలయ్యాయి. అదే సమయంలో సాయంత్రానికి వాతావరణం చల్లబడటంతోపాటు పలుచోట్ల జల్లులు పడ్డాయి. పీసీపల్లి మండలంలో వడగండ్ల వాన కురిసింది. గత నెలాఖరు నుంచి జిల్లాలో ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. శనివారం ఒక్కసారిగా తీవ్రత పెరిగింది. ఉదయం 10గంటల నంచే ఎండ మండింది. మధ్యాహ్నం 12 గంటలకే చాలాచోట్ల 39 నుంచి 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం 4 గంటల వరకు ఎండ ప్రభావం కొనసాగింది. మధ్యాహ్నం 12 గంటల సమయానికి రాష్ట్రంలో అత్యధికంగా మద్రిపూడి మండలం జువ్విగుంటలో 40.28 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 1 గంట సమయంలో వైపాలెం మండలంలో గోళ్లవిడిపిలో రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా 41.33 డిగ్రీల ఎండ కాచింది.

దరిమడుగులో 42.90 డిగ్రీలు

రాష్ట్రంలో ప్రభుత్వం ఉష్ణోగ్రతలు నమోదు చేసే 1,599 సెంటర్లలో 33చోట్ల మధ్యాహ్నం 2 గంటల సమయంలో 41 డిగ్రీలపైన నమోదైంది. అందులో ఐదు కేంద్రాలు మన జిల్లాలోనే ఉన్నాయి. ఆ సమయంలో తర్లుపాడులో గరిష్ఠంగా 41.30 డిగ్రీలు నమోదైంది. సాయంత్రం ఐదు గంటల వరకు పలు ప్రాంతాల్లో ఇదే తరహాలో ఎండలు కాచాయి. మార్కాపురం మండలం దరిమడుగులో సాయంత్రం 4 గంటల తర్వాత కూడా 42.90 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండటం ఎండ తీవ్రతను తెలియజేస్తోంది. ఇక జిల్లా కేంద్రమైన ఒంగోలులోనూ శనివారం ఎండమండింది. ఈ సీజన్‌లో తొలిసారిగా శనివారం 41.80 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. శుక్రవారం కన్నా శనివారం ఏకంగా 4 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. ఇదిలా ఉండగా సాయంత్రం 4 గంటల సమయానికి కొన్ని ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది. మబ్బులు కమ్మి చల్లగాలులు వీచాయి. కొన్నిచోట్ల జల్లులు పడ్డాయి. పీసీపల్లి మండలంలో ఏకంగా వడగండ్ల వాన కురిసింది. ఇతర ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. ఆదివారం నుంచి ఎండలు మరింత పెరిగే అవకాశంఉంది.



మాచర్లవారిపల్లి గ్రామంలో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చిల్లచెట్లు

పీసీపల్లిలో వడగండ్ల వాన

పీసీపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం వడగండ్లు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు కమ్మవారిపల్లి, పీసీపల్లిలో వేపచెట్లు, చిల్లచెట్లు విరిగిపడ్డాయి. అవి కొన్నిచోట్ల విద్యుత్ తీగలపై పడడంతో తెగిపోయాయి. స్థానికులు సబ్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వడంతో ఆయా ప్రాంతాలకు సరఫరాను నిలిపివేశారు. పీసీపల్లి వేబ్రిడ్జి సమీపంలో చిరువ్యాపారి ఏర్పాటుచేసుకున్న బంకుపై ఉన్న రేకులు గాలికి ఎగిరిపోయాయి. కమ్మవారిపల్లెలో పొగాకు బ్యారన్‌ల రేకులు ఎగిరిపోయాయి. పీసీపల్లిలోని కోళ్ల ఫారంలో గాలి తీవ్రతకు వెయ్యి కోళ్లు మృత్యువాతపడ్డాయి. మూలవారిపల్లిలో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి వర్షపు నీటికి తడిసిపోయింది. తహసీల్దార్ కార్యాలయం ప్రహరీగోడ కూలిపోయింది. మాచర్లవారిపల్లిలో చిల్లచెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. స్థానికులు వాటిని తొలగించారు. దోస, పుచ్చచేలల్లో వర్షపునీరు నిలిచింది. కాయలు నాణ్యతను కోల్పోవడంతో మంచిధర రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పీసీపల్లి మండలం మూలవారిపల్లిలో వర్షపు నీటిలో తడిసిన మిర్చి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు సాగుభూములా?

- ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో సాగు భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విమర్శించారు. ఇప్పటివరకు కార్పొరేట్లకు ఎన్ని భూములు కేటాయించారు? వారు ఎన్ని పరిశ్రమలు స్థాపించారు? అలాగే ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా పార్టీ ప్లీనంలో పాల్గొనేందుకు వచ్చిన శ్రీనివాసరావు శనివారం ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 25 ఏళ్ల కాలంలో పారిశ్రామిక అభివృద్ధి పేరుతో సుమారు 1.48లక్షల ఎకరాలను రైతుల నుంచి కార్పొరేట్ కంపెనీలకు బదలాయించారని ఆరోపించారు. సెజ్‌లు, పారిశ్రామిక కారిడార్ పేరుతో ఏపీఐఐసీ రైతుల నుంచి స్వాధీనం చేసుకున్న భూముల్లో గత 25ఏళ్లలో ఎన్ని విదేశీ కంపెనీలు వచ్చాయి, ఎన్ని పరిశ్రమలు స్థాపించారు, ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారో ఆ ప్రాంత ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సేకరించిన భూముల్లో కనీసం 20శాతం కూడా పరిశ్రమలు స్థాపించలేదని, 45వేల ఎకరాలకుపైగా ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మన్నవరంలో బీహెచ్‌ఎల్ కంపెనీ ఏర్పాటుకు కేంద్రం ప్రకటించిన రూ.4వేల కోట్లు ఇవ్వలేదన్నారు. ఒంగోలులో 110 ఎకరాలలో ఉన్న ఒంగోలు డెయిరీని ఎన్‌డీడీపీ లాభాల్లో నిర్వహిస్తుండగా ఇదే టీడీపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని మూతవేసిందని గుర్తు చేశారు. పదివేల మందికి ఉపాధి కల్పించే మార్కాపురం పలకల పరిశ్రమపై 25శాతం జీఎస్‌టీ విధించడం వల్ల పరిశ్రమలు దివాళా తీశాయని ఆరోపించారు. ప్రభుత్వ విధానాల వల్ల జిల్లాలోని గ్రోత్ సెంటర్‌లోని కంపెనీలు 50శాతం మూతపడగా, చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో నెట్టబడిందని విమర్శించారు. ఆక్వా రంగం తీవ్ర నష్టాల్లో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

బల్లికురవ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త పాలెం గ్రామంలోని వీర బ్రహ్మేంద్రస్వామి వార్షిక కల్యాణం శనివారం కనులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు దేవాలయం వద్ద కల్యాణ వేడుకలను నిర్వహించారు. కల్యాణం నిర్వహించే పురోహితులు వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్ర ప్రకారం జరిపించారు. ఈసందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దంపతులు

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం జేపీ.చెరువు సమీపంలోని శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. జేపీ.చెరువు నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దేవస్థానానికి తీసుకుని రాగా వేదపండితులు అంకురార్పణ, ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. స్వామివారు హనుమంత వాహనం, శేషవాహనాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరంగనాయకస్వామి, శ్రీరాములవారి అలంకారాల్లో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దంపతులు బ్రహ్మోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు రంగయ్యయాదవ్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ విరంచియాదవ్, డాక్టర్ గ్రీష్మయాదవ్ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు శనివారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. లచ్చమ్మపేటలోని లచ్చమ్మ దేవాలయం, ఇతర ఉపాలయాలను దర్శించుకుని నెమలిగుండంలో స్నానం చేసి రంగనాయకస్వామిని భక్తులు దర్శించుకున్నారు. తొలిరోజు సుమారు 10వేల మంది భక్తులు హాజరైనట్లు అంచనా.

తాగునీటికి భక్తుల ఇక్కట్లు

భక్తులకు తాగునీటి అవసరాలు తీర్చడంలో దేవస్థాన అధికారులు విఫలమయ్యారు. అక్కడక్కడా డ్రమ్ములలో తాగునీరు ఏర్పాటు చేసినప్పటికీ ఆ నీటిని తాగేందుకు గ్లాసులు గాని, పోసేందుకు మనుషులు గాని లేరు. దీంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. ఈవిషయాన్ని స్వయంగా గమనించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి స్పందిస్తూ వేసవి తీవ్రత దృష్ట్యా భక్తులకు తగినంత తాగునీటిని అందించే ఏర్పాట్లు చేయాలని, అక్కడ మనుషులను ఏర్పాటు చేసి భక్తులకు నీరు అందించాలని దేవస్థాన అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన భక్తులను దేవస్థానం వరకు ఉచితంగా ట్రాక్టర్‌లో రవాణా సదుపాయం ఏర్పాటు చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. సీఐలు సురేష్, రామకోటయ్య, ఎస్సై కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 100 మందికి పైగా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లలో పాల్గొనగా ఎన్‌సీసీ విద్యార్థులు సహకరించారు.



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దంపతులకు ఆశీర్వచనం అందిస్తున్న పూజారులు

2 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను బోర్డు విద్యాకార్యదర్శి కృతికాశుక్లా శనివారం ప్రకటించారు. మే 12 నుంచి 20వ తేదీ వరకు రెండు సెషన్లలో ఉదయం9నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులతో పాటు పాసైన సబ్జెక్టుల్లో మార్కులు ఇంప్రూవ్‌మెంట్‌కు హాజరుకావచ్చు. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలను మే 28 నుంచి జూన్ 1 వరకు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు ఈనెల 15నుంచి 20వ తేదీ వరకు విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లో పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

22వరకు రీ కౌంటింగ్‌కు దరఖాస్తులు

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మార్కులు రీ కౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఈనెల 13 నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు బోర్డు అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కృతికా శుక్లా కోరారు.



వైభవంగా వీర్ల గంగమ్మ తిరునాళ్ల

● భక్తులు విశేష పూజలు ● ఆకట్టుకున్న ఐదు విద్యుత్ ప్రభలు

బల్లికురవ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ పరిధిలో ఉన్న వీర్ల గంగమ్మ తల్లి 42వ వార్షిక తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తల్లి గంగమ్మ దేవాలయాన్ని ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం, చెన్నుపల్లి, గుంటుపల్లి, సోమవరప్పాడు, కొణిదెన, కొప్పెరపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, కొత్తపాలెం, ముక్తేశ్వరం, రాజుపాలెం గ్రామాల నుంచి మహిళలు భారీ సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. గంగమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా నాలుగు గ్రామాల నుంచి ఐదు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. కొత్తమల్లాయపాలెం, పాత మల్లాయపాలెం, నక్కబొక్కలపాడు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు నాలుగు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. బల్లికురవ గ్రామానికి చెందిన టీడీపీ నేత నాగబోయిన రాజా మొక్కుబడి ప్రభను ఏర్పాటు చేశారు.

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక పూజలు

వీర్ల గంగమ్మ తల్లికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనవెంట టీడీపీ నేతలు మలినేని గోవిందరావు, గొట్టిపాటి లక్ష్మయ్య, కొండేటి ఇజ్రాయల్, దూళిపాళ్ల హనుమంతురావు, డీసీ వైస్ చైర్మన్ కోయ పేరయ్య, దర్శి రామస్వామి, యాగంటి సింగరయ్య, దూళిపాళ్ల వెంకట్రామయ్య, జూపల్లి రాఘవరావు, గొట్టిపాటి శంకర్, నాగబోయిన రాజా ఆదిశేషయ్య ఉన్నారు. సంతమాగులూరు సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో ఎస్ఐ నాగరాజు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. గంగమ్మ తిరునాళ్లలో నక్కబొక్కలపాడు గ్రామ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం శనివారం ఉదయం, రాత్రి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఘనంగా గంధం ఊరేగింపు

మార్టూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : షేక్ హజరత్ కరిముల్లా షావలి ఉరుసు మహోత్సవం సందర్భంగా భక్తులు ఫాతిహా కార్యక్రమం నిర్వహించిన అనంతరం శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత దర్గా నుంచి గంధం ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు గుర్రంపై బిందెలో గంధాన్ని ఏర్పాటు చేసి, మరి కొంతమంది భక్తులు తలపై గంధం నింపిన బిందెలను మోసుకుంటూ గ్రామంలోని ప్రధానవీధుల్లో తిరిగారు. తద్వారా గ్రామంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, గ్రామమంతా సస్యశ్యామలంగా ఉంటుందని నమ్మకం. గంధం తీసుకువస్తున్న భక్త బృందానికి ప్రజలు బిందెలతో నీళ్ల వార్లుగాపోసి స్వాగతించారు.


మార్టూరు గ్రామంలో గుర్రంపై గంధంను ఊరేగిస్తున్న భక్తులు

రేపే గుంటిగంగ తిరునాళ్ల


అమ్మవారి ఆలయం

తాళ్లూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు మండలంలోని గుంటిగంగలో కొలువై ఉన్న గంగాభవానీ అమ్మవారు తిరునాళ్లకు ముస్తాబయింది. జిల్లాప్రజల ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లిని దర్శించుకునేందుకు ఎటువంటి అసౌకర్యాలూ కలుగకుండా దేవదాయ శాఖ సకల ఏర్పాట్లు చేస్తోంది. ఏటా చైత్రబహుళ విదియ రోజు గుంటిగంగా భవానీ అమ్మవారికి తిరునాళ్ల నిర్వహించటం ఆనవాయితీ. ఉత్సవాలు నిర్వహణకు దేవదాయశాఖ ఇన్‌చార్జి ఈవో యు.శ్రీనివాసరావు, స్థానిక ఈవో గుంటుపల్లి వాసుబాబు, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం రాత్రి నుంచి సోమవరప్పాడు, తూర్పుగంగవరం, రామభద్రాపురం గ్రామాల్లో ఉత్సవాలు ఆరంభమయ్యాయి. ఆదివారం సోమవరప్పాడులో గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం సోమవారం ఉదయం 6 గంటలకు ఉత్సవాలు మొదలై తిరునాళ్ల ఆరంభమవుతుంది.

పోటాపోటీగా విద్యుత్ ప్రభల ఏర్పాటు

ఈ ఏడాది తిరునాళ్లకు 5 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. నాగంబొట్లపాలెం టీడీపీ రెండు వర్గాలు విడివిడిగా రెండు విద్యుత్తు ప్రభలను, మండల జనసేన పార్టీ ఒకటి, వైసీపీ ఒకటి, కాంగ్రెస్ పార్టీ ఒకటి చొప్పున విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. తిరునాళ్లకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


అమ్మవారి మూలవిరాట్

శ్రీసరస్వతి విజయ ప్రభంజనం


శ్రీసరస్వతి విద్యా సంస్థల అధినేత రమణారెడ్డిని సత్కరిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో శ్రీసరస్వతి విద్యాసంస్థలకు చెందిన ఇంటర్ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 470కి 466 మార్కులు 9మంది సాధించగా, 465మార్కులు 25 మంది, 464 మార్కులు 32మంది, 460కిపైగా మార్కులను 219మంది సాధించారు. బైపీసీ విభాగంలో 435 మార్కులకు పైగా నలుగురు, 434 మార్కులు నలుగురు, 433 మార్కులు ముగ్గురు, 420పైగా మార్కులు 22 మంది సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 1000కి 991 మార్కులు ముగ్గురు, 990 మార్కులు నలుగురు, 989 మార్కులు 9మంది, 980 మార్కులు 120 మంది విద్యార్థులు సాదించారు. బైపీసీ విభాగంలో 991 మార్కులు ఒకరు, 990 మార్కులు ఇద్దరు, 988మార్కులు ఇద్దరు, 980 మార్కులకు పైగా 12 మంది విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యా సంస్థల చైర్మన్ ఏవీ.రమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో శ్రీసరస్వతి విద్యాసంస్థలకు గుర్తింపు తెచ్చేందుకు సహకరించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకరరెడ్డి, సీఈవో ఎన్‌వీ.సురేష్, డీన్స్, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.


విజయకేతనం చూపుతున్న విద్యార్థులతో డైరెక్టర్ మల్లేశ్వరరావు

ఉమామహేశ్వర విద్యార్థులు జయకేతనం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ జూనియర్, సీనియర్ ఫలితాల్లో ఒంగోలులోని ఉమామహేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో సీహెచ్.లావణ్య 1000మార్కులకు 987, బి.ప్రసన్న 983, కె.లక్ష్మి 981, పి.ప్రశాంతి 980, అలాగే బైపీసీ విభాగంలో ఎం.సుజిత 984, జి.తనూజ 984 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కె.అవినాష్ 464, పి.జయసాయిప్రభాషిణి 464, ఎం.పవన్‌కళ్యాణ్ 463, ఎస్.హేమలత 461, జూనియర్ బైపీసీలో ఎం.మాధూరి 429, ఎంఈసీ విభాగంలో ఐవీ.సలోక 470 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా శనివారం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ సి.మల్లేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

వడదెబ్బ నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసరంగా 186 బెడ్లు ఏర్పాటు
● జిల్లా, ఏరియా వైద్యశాలల్లోనూ ప్రత్యేక చర్యలు
● వైద్యశాలలకు 8.95 లక్షల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఎండ తీవ్రతతో వడదెబ్బ బారిన పడే వారిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందుకోసం ప్రణాళికాబద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఏడాది ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వడదెబ్బ బారి నుంచి ఉపశమనం పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. గత పక్షం రోజుల నుంచి ఎండ తీవ్రత తగ్గుతూ పెరుగుతూ వస్తున్న నేపథ్యంలో వైద్యశాఖను అప్రమత్తం చేశారు. అందుకోసం తీసుకోవాల్సిన విధి విధానాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో అందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. వడదెబ్బ బారిన పడిన వారికి తక్షణమే వైద్య సేవలు అందించేందుకు వైద్యశాలల్లో ప్రత్యేకచర్యలు తీసుకున్నారు. ఒక్కొక్క ప్రాథమిక వైద్యశాలలో రెండు బెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు 108 వాహనాన్ని కూడా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా జిల్లాలో చర్యలు తీసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఏరియా వైద్యశాలలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలతో పాటు ఒంగోలులోని రిమ్స్, మార్కాపురంలోని జిల్లా ఆస్పత్రిలో 186 బెడ్లను అందుబాటులోకి తెచ్చారు. వీటితో పాటు వడదెబ్బబారిన పడిన వ్యక్తికి తక్షణమే ఉపసమనం కల్పించే విధంగా ఐస్‌ప్యాక్‌తో పాటు మందులను కూడా అందుబాటులోకి తీసుకొని వచ్చారు. మరోవైపు జిల్లాకు 8.95 లక్షల ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రభుత్వం జిల్లాకు సరఫరా చేసింది. వీటిని జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలలతో పాటు పంచాయతీ కార్యాలయాల్లో కూడా అందుబాటులో ఉంచారు.

సత్తాచాటిన శ్రీప్రతిభ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీప్రతిభ విద్యా సంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులతో సత్తా చాటారు. సీనియర్ ఇంటర్ విభాగంలో 1000 మార్కులకు 990 మార్కులను ఇద్దరు విద్యార్థులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో గోర్ల శృతి, సీహెచ్.స్నేహ 990 మార్కులు, కె.వెంకటకళ్యాణ్‌రామ్ 989, టి.మౌనిక 988, శెట్టి పూజిత 988, సీహెచ్.వెంకటత్రిష, అద్దంకి వంశీ, కుర్రా వెంకటమహాలక్ష్మి 987 మార్కులు, పోటు విష్ణు, ఆట్ల వెంకటప్రసాద్, మల్లెల తులసీలు 986 మార్కులు, కె.వెంకటనాగసాయియశ్వర్ధన్, కె.జశ్వంత్‌లు 985, కొణిజేటి వెంకటసాయిపూజిత, శానం అనుష్క 984, మెట్ల హేమశ్రీ, సుంకర అవినాష్, ఎస్.బాలకృష్ణ, చింత నందిని, షేక్ ఆషాలు 983, సీహెచ్.లక్ష్మీస్రవంతి, నాగిరెడ్డి అనుష్క, కె.సౌజన్య, ఎం.వెంకటనవ్య, ఎం.స్నేహ 982 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో వెలుగు హాసిని 987, దొండపాటి స్నేహారెడ్డి 981 మార్కులు సాధించారు.

జూనియర్ ఇంటర్‌లో 470 మార్కులకు 465 మార్కులు ముగ్గురు విద్యార్థులు సాధించారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో ఆరే సాయిధీరజ్, మాకినేని మనోజ్, షేక్ అసురుద్దీన్‌లు 465 మార్కులు, కె.పూర్ణచంద్ర, బి.గోపీచంద్, వై.బ్రహ్మారెడ్డి, కె.చంద్రిక, టి.రమ్య, చల్లా శ్రావ్య, ఎ.దీపిక 464, ఎం.సాయిమనోజ్‌బాబు, వి.స్రవంతి, ఎ.అంజన, ఎ.కాశేశ్వరి, కె.వెంకటసాయిలక్ష్మి, హర్షిణి, కె.వెంకటఅశ్విని, వై.హేమవర్షిణి, ఆర్.లాస్య, పి.వెంకటరాధిక, సీహెచ్.వెంకటనందిని, ఎన్.వాణి, ఎస్.శ్రీలక్ష్మి 463, జె.నాగసింధూరి, పి.గిరిష్‌కుమార్, యు.అభిలాష్, ఎం.యశ్వని 462 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో డి.పూజిత 433, డి.వైషాలి 430, పి.సంతోషిణి 429 మార్కులు పొందారు. జూనియర్ ఇంటర్‌లో 82శాతం, సీనియర్ ఇంటర్‌లో 92శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్‌నారాయణ ప్రత్యేకంగా అభినందించారు.


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో అధిపతి రవికుమార్

శ్రీహర్షిణి విజయదుందుభి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని శ్రీహర్షిణి జూనియర్ కళాశాలల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో బత్తుల ధరణి 466 మార్కులు, ఎస్.భార్గవి, పి.లక్ష్మీనారాయణ, పి.హృదయబాబు 465 మార్కులతో ఫలితాల్లో మోతమోగించారు. జూనియర్ బైపీసీ విభాగంలో జి.ఉజ్వలహర్షిణి 440 మార్కులకు 431 మార్కులు సాధించగా, ఎంఈసీలో 500 మార్కులకు 467 మార్కులు, సీఈసీలో 465 మార్కులు సాధించారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో అడక మధు 1000కి 988 మార్కులు, ఎస్‌కే.షీరున్నీష 988 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో, వి.జాన్‌తేజ, యు.శ్రావణి 986 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో కటారి హారిక 973 మార్కులు పొందారు. ఎంఈసీ విభాగంలో సుహాషి 953, సీఈసీలో సింగమశెట్టి సాయిదుర్గ 959 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో 460కిపైగా 39మంది, 400పైగా మార్కులు 281 మంది సాధించగా సీనియర్ ఇంటర్‌లో 980కి పైగా 18మంది, 900లకుపైగా 300 మంది విద్యార్థులు మార్కులు పొందారు. కళాశాలలో శనివారం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ దాడి ఆంజనేయులు, అకడమిక్ డీన్ కరణం నారాయణ, ప్రిన్సిపాల్ దివి రమేష్, ఎం.ఏడుకొండలు, ఏవో నంబూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మార్కాపురం తహసీల్దార్ కారు బోల్తా

● త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


తిరిగబడిన కారు

పొదిలి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం తహసీల్దార్ చిరంజీవికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారు మూడు పల్టీలు కొట్టింది. అయితే కారులో ప్రయాణిస్తున్న తహసీల్దార్, ఆయన భార్య క్షేమంగా బయటపడ్డారు. మార్కాపురంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న టి.చిరంజీవి, ఆయన భార్య శనివారం ఉదయం మార్కాపురం నుంచి ఒంగోలుకు బయలుదేరారు. ఈ క్రమంలో పొదిలి ఒంగోలు రహదారిలో అగ్రహారం దాటిన తరువాత వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలం సమీపంలోకి వెళ్లేసరికి కారుకు ముందు వెళుతున్న ద్విచక్రవాహనదారుడు ఒక్కసారిగా కుడివైపునకు తిరిగాడు. దీంతో ద్విచక్రవాహనాన్ని ఢీకొడతానేమోననే కంగారులో తహసీల్దార్ చిరంజీవి కారుకు షడన్ బ్రేక్ వేయడంతో కారు మూడు పల్టీలు కొట్టి నుజ్జునుజ్జు అయింది. కారులో ఉన్నవారికి కొద్ది గాయాలయ్యాయి. వారిని పొదిలి రెవెన్యూ సిబ్బంది, పోలీసులు మరొక కారు ఏర్పాటు చేసి ఒంగోలు పంపించారు. ద్విచక్ర వాహనదారుడు రోడ్డుభద్రత నియమాలు పాటించకపోవడం, వెనుకవస్తున్న వాహనాన్ని గమనించకపోవడం ప్రమాదానికి కారణమైందని స్థానికులు తెలిపారు. అదే కారు బ్రేకు వేయకపోతే ద్విచక్రవాహన దారుడిని ఢీకొట్టేదని పలువురు పేర్కొంటు న్నారు. ఏది ఏమైనా క్షణాల్లో పెను ప్రమాదం తప్పిందనే చెప్పాలి. సీట్‌బెల్ట్ పెట్టుకొని ఉండడం, బెలూన్ ఓపెన్‌కావడంతో ప్రమాద తీవ్రత తగ్గింది.

ఎన్ఆర్ఐ విద్యార్థుల విజయకేతనం



విద్యార్థినులను అభినందిస్తున్న ఎన్ఆర్ఐ కాలేజీ ప్రతినిధులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. జూనియర్ ఎంపీసీలో సెనిగ ఇందు 465, మల్లెపూల శరణ్య 459, షేక్ ఖాసీర్‌వలి 453, చిత్తలూరి తరుణ్ 451, నగరికంటి అనంతవెంకటతరుణ్ 451 మార్కులు, అలాగే బైపీసీ విభాగంలో వెరిచర్ల నిహారిక 433, షేక్ జబీరియా 418 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో రాయవరపు వెంకటనాగ గోదాలక్ష్మీదేవి 989, మద్దిపాటి మేఘన 987, పావురాయలమంజు అజితశ్రీ 987, కనుమూరి ప్రవల్లిక 985, నన్నిబోయిన హేమలత 984, ఇక బైపీసీ విభాగంలో శంకరమంచి నాగవైష్ణవి 984, పర్రె సుస్మితరాణి 982 పార్కులు సాధించారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో 450కిపైగా మార్కులు 38మంది, సీనియర్ ఎంపీసీలో 950కిపైగా మార్కులు 32 మంది విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా శనివారం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల డీన్ సురేష్, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల విజయదుందుభి



విజయసంకేతం చూపుతున్న విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగుర వేశారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో షేక్ మహ్మద్466, దేవరంపాటి వర్షిణి 465మార్కులు సాధించారు. అలాగే 464 మార్కులకు పైగా 10 మంది, 460 మార్కులకుపైగా 52 మంది విద్యార్థులు పొందారు. జూనియర్ ఇంటర్‌లో 93 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో బత్తుల తేజశ్వరి ఎం.సౌమశ్రీ, గోసుల వర్షిత సాయిలక్ష్మి 988 మార్కులు సాధించారు. 975 మార్కులకు పైగా 129 మంది సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 96శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల బ్రాంచి డీన్ ఎం.రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా చారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో 'రేస్' విద్యార్థుల హవా



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో ఒంగోలులోని రేస్ జూనియర్ కళాశాల, ఐఐటీ అకాడమీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. సీనియర్ ఇంటర్‌లో బి.చందన 989, ఎం.అక్షయ 983, టి.దివ్యసాయి 983, ఎస్‌కే.మన్సూద్‌అమీన్, కె.హాసిని 982, జి.వెంకట్‌సాయి 981 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో ఈవీ.సాయిఅభిరామ్, టి.యశ్వంత్ 463, ఎం.భరత్‌సాయి వంశీ, ఎస్.యశశ్రీ, వి.బిందుశ్రీ సాహితి, కె.వేదశ్రీ 461, జీవీ.యశ్వంత్‌గుప్త 460 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

ఎస్ఎస్ఎన్ విద్యార్థుల విజయభేరి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ యల్లటూరి శివానందరెడ్డి తెలిపారు. స్థానిక కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంపీసీ విభాగంలో ఎన్.సావిని, పి.జోషితలు 465 మార్కులు సాధించారన్నారు. 464 మార్కులు నలుగురు, 463 మార్కులు ఇద్దరు, 462 మార్కులను ఇద్దరు, 460కి పైగా 12 మంది, 455 మార్కులకు పైగా 19మంది, 400లకు పైగా మార్కులను 75 మంది సాధించారు. 90శాతానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఎం.జనార్దన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీసాయిరాం విద్యార్థుల విజయకేతనం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీసాయిరాం జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఆవుల నవ్యశ్రీ 465, తిరుమలశెట్టి రిషిచంద్రిక 465, ఎ.భానుశ్రీ 464, ఆరికట్ల భవిశ్రీ 463 మార్కులు సాధించారు. 460కిపైగా మార్కులును 22 మంది విద్యార్థులు పొందారు. ఇక బైపీసీ విభాగంలో బీఎన్ సంధ్యారాణి 435 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో అంబటి రుషిత్మతా రెడ్డి 980, బైపీసీలో కె.నాగశివకిరణ్ 982 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను కాలేజీ చైర్మన్ డాక్టర్ కరి అంజయ్య, కరస్పాండెంట్ కె.మోహన్‌రావు, అధ్యాపకులు అభినందించారు.

వీనస్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం సంతపేటలోని వీనస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. జూనియర్ ఎంపీసీలో కొల్లూరి సాత్విక 462, కట్టా అమృతవల్లి 461మార్కులు, సీనియర్ ఇంటర్‌లో అపాల పృథ్విజ 983 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఆర్.వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు.

నారాయణ విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని నారాయణ కళాశాలల విద్యార్థులు శనివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. అత్యుత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో పి.భవజ్ఞప్రియ, జి.ప్రణతిదత్తసాయి 470కి 466 మార్కులు సాధించారు. డి.దేవిఅక్షయ, కౌసల్యమనోజ్ఞ, డి.సాహితి 465 మార్కులు పొందారు. ఇక 460కిపైగా మార్కులను 28 మంది సాధించారు. బైపీసీ విభాగంలో హాసిని 440కి 434 మార్కులు, హఫిఫా 427మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో షేక్ రైజు 1000కి 990 మార్కులు, గీతిక 989 మార్కులు సాధించారు. 980కిపైగా మార్కులు 26 మంది సాధించినట్లు విద్యాసంస్థల కోర్ డీన్ ఆర్.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం మురళీ, ప్రిన్సిపాల్స్ ఎం. సుజాత, డి.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీ విద్యార్థి విభాగం కార్యదర్శిగా రవీంద్రనాథ్

మద్దిపాడు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ విద్యార్థి విభాగం కార్యదర్శిగా బసవన్నపాలెం గ్రామానికి చెందిన గుంతోటి రవీంద్రనాథ్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయనకు లేఖ అందింది. ఈ సందర్భంగా శనివారం రవీంద్రనాథ్ మాట్లాడుతూ అధిష్టానికి కృతజ్ఞతలు చెప్పారు.

దళితుల అభ్యున్నతే ధ్యేయం

మంత్రి డాక్టర్ స్వామి ● పాకల ఎస్సీకాలనీల్లో ఆర్వో ప్లాంట్లు, మహిళా సమాఖ్య భవనం ప్రారంభం ● పాల్గొన్న మారిటైం బోర్డు చైర్మన్ సత్య



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్య

సింగరాయకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : దళితుల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. అందుకోసం సీఎం చంద్రబాబు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. మండలంలోని పాకల క్రిస్టియన్‌పాలెం, అంబేడ్కర్‌నగర్‌లో రూ.12 లక్షలతో నూతనంగా నిర్మించిన రెండు ఎన్టీఆర్ సుజల ఆర్వో ప్లాంట్లను, రూ.20లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి శనివారం మంత్రి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా పాకలలోని రెండు ఎస్సీ కాలనీల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేసి తాగునీటి ఇక్కట్లను తొలగించామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి దళితులకు మేనమామనని చెప్పి వారిని అధఃపాతాళానికి తొక్కారని దుయ్యబట్టారు. ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి దళితులను ఆర్థికంగా అణగదొక్కారని ధ్వజమెత్తారు. త్వరలోనే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.341 కోట్లతో రుణాలు ఇవ్వబోతున్నట్లు మంత్రి స్వామి వెల్లడించారు. టంగుటూరు నుంచి పాకలకు రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కాలనీల్లో మిగిలి ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీలను కూడా పూర్తి చేస్తామని చెప్పారు.

పాకలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం : సత్య

పాకలను సుందరమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. తీరంలో ఇప్పటికే ఫిషింగ్ ల్యాండ్ సెంటర్ ఏర్పాటుకు రూ.3 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. పాకల గేటు వద్ద ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మత్స్యకార భరోసా కింద కూటమి ప్రభుత్వం వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేలు భృతి ఇస్తుందని చెప్పారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పాకలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను మంత్రి స్వామి, సత్య ప్రారంభించారు. కార్యక్రమాల్లో పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, టీడీపీ నేతలు షేక్ సంధానీబాషా, సుదర్శి చంటి, గాలి హరిబాబు, రాజగోపాల్‌రెడ్డి, యస్దాని, పోతురాజు, కన్నా ప్రసాద్, అంబటి కోటేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం నిధులు పక్కదారి

● తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి..

● రూ.3,92,410 రికవరీకి పీడీ ఆదేశాలు



పీడీ జోసఫ్‌కుమార్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సంతనూతలపాడు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీల్లో రూ.3,92,410 పక్కదారి పట్టినట్లు డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ తెలిపారు. శనివారం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ సదస్సు జరిగింది. ఇందులో ప్రధానంగా మేజర్ పంచాయతీ అయిన సంతనూతలపాడులో రహదారికి సంబంధించి అవకతవకల్లో రూ.3,53,403లను రికవరీకి పీడీ ఆదేశించారు. మొక్కలకు సంబంధించి అధికారులు రికార్డులు తయారు చేయకపోవడంతో వారికి షోకాజు నోటీసు జారీ చేశారు. మండలంలో 732 పనులకుగాను రూ.7.30కోట్లు ఉపాధిహామీ పనులకు చెల్లించారు. కాగా సామాజిక తనఖీ సమావేశంలో ఉపాధిహామీ అవకతవకలపై టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో పక్కనే ఉన్న ఎంపీడీవో సురేష్‌బాబు, ఇతర అధికారులు సర్ది చెప్పడంతో వాగ్వాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో ఏపీవో వాసంతి, ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మ, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హరిహరక్షేత్రంలో ఘనంగా మహాకుంభాభిషేకం

● హాజరైన ఎమ్మెల్యే బీఎన్





పూజల్లో పాల్గొన్న శిద్దా రాఘవరావు, కుటుంబసభ్యులు, ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తిలో హరిహరక్షేత్రం వార్షికోత్సవాలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. ఈ సందర్భంగా మహాకుంబాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుటుంబసభ్యులతో కలిసి ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ విశేష పూజల్లో పాల్గొన్నారు. విజయ్‌కుమార్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి సత్కరించారు. వేదపండితులు కృష్ణశర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రివేళ నగరోత్సవం కనుపండవుగా నిర్వహించారు. కార్యక్రమంలో శిద్దా వెంకటేశ్వరరావు, పాండురంగారావు, సుధీర్‌కుమార్, బాలాజీ, సుధాకర్, శిద్దా వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బమ్మ ట్రస్ట్ సభ్యులు, శిద్దా కుటుంబసభ్యులు, గ్రానైట్ పరిశ్రమకు చెందిన నాయకులతోపాటు పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగసత్యలత

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి): రంగులు ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు, ప్రముఖ చిత్రకారిణి రంగుల సంధ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు చిత్రకళలో శిక్షణనివ్వటం ద్వారా వారిలో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఈ సమ్మర్ క్యాంపులో చిత్రకళ, సంగీతం, డాన్స్, హ్యాండ్‌రైటింగ్ స్కిల్స్‌లో శిక్షణనివ్వనున్నట్లు రంగుల సంధ్య తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని, మరిన్ని వివరాలకు 9948477950, 8184907799 సెల్ నెంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

క్రీడాపోటీలు ప్రారంభం



ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడాపోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సంతపేటలో ఏర్పాటు చేసిన పోటీలను నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చిక్కాల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మూడు రోజులపాటు కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, కర్రసాము, బాక్సింగ్‌తోపాటు ఆర్చరీ (విలువిద్య) పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూర్యశ్రీ ట్రస్ట్ సెక్రటరీ సర్దార్‌బాషా, ఒంగోలు మురళీకృష్ణ, సీహెచ్.సుధీర్, నిర్వాహకులు గురు భరత్, రాజేష్, సురేష్ పాల్గొన్నారు.

మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

ఒంగోలు క్రైం, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా ఎంవీ.రమణకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న సీఐ సుధాకర్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్న అనంతరం సిబ్బందితో సమావేశం అయ్యారు. స్టేషన్‌లో కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

గరుడ వాహనంపై శ్రీరఘునందనుడు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన చదలవాడ శ్రీరఘునాయకస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ఈవో అనిల్ పర్యవేక్షణలో ఆరవ రోజు శనివారం ఉదయం స్వామివార్లకు విశేష పూజ, అలంకరణ చేశారు. అనంతరం స్వామివారికి బలిహరణ, తిరుచ్చి ఉత్సవం, మధ్యాహ్నం మోహినీ ఉత్సవం నిర్వహించారు. రాత్రికి స్వామివారిని విశేషాలంకరణలో గరుడవాహనంపై గ్రామంలో విహరించారు. మద్దిరాలపాడు గ్రామానికి చెందిన చెరుకూరి రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, నల్లూరి గోవిందమ్మ, శ్రీనివాసప్రసాద్, చెరుకూరి పున్నయ్య, గంగ జవహర్, చెరుకూరి సుబ్బారాయుడు ఉభయదాతలుగా వ్యవహరించారు. కళాకారులు భరతనాట్యం ప్రదర్శించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.వెంకట్రావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటువంటి విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్ శ్రీనివాసరావు, ఉప్పుటూరి ప్రకాశరావు, వీరారెడ్డి, కారుమూడి నాగేశ్వరరావు, లక్ష్మయ్య, పోలేరయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్లకు డీఆర్ అలవెన్సులు ఇవ్వాలి

ఒంగోలు(రూరల్), ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు 2018 ఏడాది నుంచి ఇవ్వాల్సిన డీఆర్ అలవెన్సును ఇప్పటికైనా అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రామ్మోహనరావు డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని సంఘ భవనంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి చైర్మన్ నియమించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె.పాపారావు, వీరరాఘవాచారి, బీవీ.శేషయ్య, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

భూమనపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : టీటీడీలో గో మరణాలపై భూమన కరుణాకర్‌రెడ్డి అసత్య ప్రచారంతో మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గోమాతలపై, టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలించేలా మాట్లాడటం దుర్మార్గమన్నారు. తిరుమల కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించింది కరుణాకర్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. చేసిన తప్పుడు పనులకు విధులకు దూరమైన హరనాథ్‌రెడ్డి కోసం అసత్య ప్రచారాలు చేయడం, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడిన కరుణాకర్ రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

వైభవంగా చెన్నకేశవుని కల్యాణం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు ఇన్‌సెట్లో .. ఉత్సవమూర్తులు

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవస్వామిపేట శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో శనివారం ఉదయం నిర్వహించిన భూనీలా సమేత ప్రసన్న చెన్నకేశవస్వామి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థాన అర్చక బృందం స్వామివారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం జరిగిన కళ్యాణోత్సవంలో విష్వక్సేన పూజ, కలశారాధన, కంకణధారణ, చలువచొప్పరం, ఎదురుకోలు తదితర క్రతువులు నిర్వహించారు. ఇక శనివారం రాత్రి నిర్వహించిన గరుడవాహన సేవలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరుకాగా ఆయనకు ఆలయ ఈవో రావెళ్ల శివశంకర్, అర్చకబృందం సాదర స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

కొండపి కళాశాలలో 70 శాతం ఉత్తీర్ణత

కొండపి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో 70శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. మొదటి సంవత్సరం బైపీసీలో కట్టావారిపాలెం గ్రామానికి చెందిన కుంచాల ప్రవల్లిక అత్యధికంగా 429 మార్కులు సాధించిందని చెప్పారు.

సింగరాయకొండ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు

సింగరాయకొండ : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో కె.కిరణ్ 446, సీఈసీలో కె.అమూల్య 418, హెచ్ఈసీలో కె.వరలక్ష్మి 424, ఒకేషనల్ (ఓఏ)గ్రూపులో ఎస్‌కే. సాజియా ప్రవీణ్ 468, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులో ఎం.సంధ్య 445 మార్కులు సాధించినట్లు వివరించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో పి.జ్యోతి 926, బైపీసీలో పి.సాయిరాం 972, ఓఏలో పి.కల్యాణి 922, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులో కె.భార్గవి 945 మార్కులు సాధించినట్లు తెలిపారు.

స్మార్ట్‌జెన్ విద్యార్థుల సత్తా

జూనియర్ ఇంటర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక స్మార్ట్‌జెన్ విద్యార్థులు సత్తా చాటారు. ఎంపీసీ విభాగంలో డి.హిమప్రియ 453, ఎం.దివ్యశ్రీ 448, సాయినేహ 443తోపాటు మరో 11 మంది విద్యార్థులు 420పైగా మార్కులు సాధించారు. వారిని చైర్మన్ పి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి, అధ్యాపకులు అభినందించారు.

చీమకుర్తి విద్యార్థుల ప్రతిభ

చీమకుర్తి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో చీమకుర్తి విద్యార్థులు ప్రతిభచాటారు. స్థానిక సాంఘీకసంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ద్వితీయ సంవత్సరం వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ తెలిపారు. ఎంపీసీలో బి.శిరీష 983, లక్ష్మీతనూషా 980 మార్కులను సాధించారు. బైపీసీలో కీర్తన 972 మార్కులు సాధించి టాపర్లగా నిలిచారు. పట్టణంలోని ఎంఎస్ఆర్ కళాశాల విద్యార్థులు విశేష ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ వీవీ.శివారెడ్డి తెలిపారు. రెండో సంవత్సరం ఎంపీసీ విభాగంలో బల్లిపల్లి శివాని 984 మార్కులు సాధించి మండలస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. బైపీసీలో ముక్తవరపు శ్రీవాణి 970 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో మాకాని దివ్యశ్రీ 464 మార్కులు సాధించి మొదటిస్థానంలో నిలిచారు. వీరందని యాజమాన్యం అభినందించారు.


ఏఆర్ కానిస్టేబుల్ మృతి

ఒంగోలు క్రైం, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారి పడి ఏఆర్ కానిస్టేబుల్ కె.సురేష్ (42)మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. శనివారం ఒంగోలు-కరవది మధ్య ఈ సంఘటన జరిగింది. కొండపికి చెందిన సురేష్ ప్రస్తుతం ఒంగోలులోని పోలీసు శిక్షణ కళాశాలలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు.

15న ఉగాది పురస్కార గ్రహీతల అభినందన సభ

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి విశ్వావసు ఉగాది పురస్కారాలను అందుకున్న సాహితీవేత్తలకు ఈ నెల 15వ తేదీన అభినందన సభ నిర్వహిస్తున్నట్లు ఒంగోలు సాహిత్య సంస్థల వేదిక నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని అందుకున్న నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావులను ఘనంగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహించే సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు ప్రముఖులు, సాహిత్యవేత్తలు హాజరవుతారన్నారు. సాహిత్య, కళారంగ అభిమానులు ఈ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వైభవంగా గంగమ్మతల్లి తిరుణాళ్ల



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

మద్దిపాడు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గార్లపాడు గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి తిరునాళ్లను శనివారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా కొండ ప్రాంతంలో ఏర్పాట్లు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

కొనసాగిన కేంద్రబృందం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఒంగోలు(రూరల్), ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): త్రోవగుంట సమీపంలోని గుడిమెళ్లపాడు అర్బన్ హెల్త్ సెంటర్‌లో కేంద్ర వైద్యశాఖ బృందం పరిశీలనలు శనివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా బృందంలోని డాక్టర్ ఎస్.పంకజ్, డాక్టర్ షీలా ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి పలు వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయా వివరాలను కేంద్రవైద్యశాఖకు అందజేస్తామని, దీని ఆధారంగా వైద్యశాలకు అదనపు నిధులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు సమీర్‌శర్మ, లియో, ఖాసిం, హనా కీర్తన, కృష్ణప్రసాద్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మద్దిపాడు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఏడుగుండ్లపాడు పంచాయతీ పరిధిలోని హర్షిణి కాలేజీ ఎదురుగల జాతీయ రహదారి బస్సు షెల్టర్ పక్కన ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. అతడి వయస్సు 35 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఛాతీపైన సరోజా అని పచ్చబొట్టు ఉందని ఎస్ఐ శివరామయ్య తెలిపారు. వీఆర్వో కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

నేడు మద్దిపాడులో ఉచిత వైద్య శిబిరం

మద్దిపాడు, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు నటరాజ కళాకేంద్రంలో బీఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా కాకుమాను అయ్యన్న మెమోరియల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కాకుమాను శశికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిమ్స్ హాస్పిటల్ వైద్యులు నరాలు, కీళ్ల షుగర్, బీపీ, గుండె, ఊపిరితిత్తులు తదితర వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేస్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్ శ్రీధర్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు శోభ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన పూల్ క్యాంపస్ ప్రాంగణ ఎంపికలో ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జి.వెంకటసాయి, జి.మనోజ్, అశోక్, కైలాష్ శ్రీనాగసత్యసాయి, పి.వెంకటేష్‌బాబు, ఎం.రూపేష్ రూ.3.4లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికకాగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు వీరాంజనేయులు, సీవీ.సుబ్బారావు, రూప అక్కేష్ తదితరులు పాల్గొన్నారు.

'మాకినేని'కి ఘన నివాళి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు మాకినేని బసవపున్నయ్య వర్ధంతి సందర్భంగా శనివారం ఒంగోలులో ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు బసవపున్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కేమాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పూనాటి ఆంజనేయులు. జీవీ.కొండారెడ్డి, సయ్యద్‌హనీఫ్, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, వై.సిద్ధయ్య, జాలా అంజయ్య, హనుమంతరావు, బాలకోటయ్య, రఘురాం, జయంతిబాబు పాల్గొన్నారు.

అవి.. ఇవి

విశ్రాంత ప్రిన్సిపాల్ మృతి

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం గౌతవరం గ్రామంలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ టి.నరసింహారావు (74) మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన నరసింహారావు రాయలసీమ కో-ఆపరేటివ్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. అనంతరం గ్రామంలో టీడీపీకి సీనియర్ నాయకులుగా వ్యవహరిస్తున్నారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు కె.యోగానంద్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

డాక్టర్ మోహన్‌రెడ్డికి సన్మానం


మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న టెన్నిస్ క్రీడాకారులు

గిద్దలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సైకాలజి విభాగంలో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ అవార్డు పొందిన నేత్ర వైద్యనిపుణులు, ప్రకాశం జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జీకే.మోహన్‌రెడ్డిని స్థానిక టెన్నీస్ క్లబ్‌లో క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. అంధత్వ నివారణ కోసం ప్రచారం నిర్వహించడమే కాకుండా నేత్రవైద్యానికి సంబంధించి సైకాలజి విభాగంలో డాక్టరేట్ పొందిన మోహన్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో లాన్‌టెన్నీస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చేరెడ్డి రంగారెడ్డి, కార్యదర్శి రాఘవులు, రిక్రియేషన్ క్లబ్ కోశాధికారి త్రిమూర్తిరెడ్డి, టెన్నీస్ కోచ్ మురళిమోహన్‌రెడ్డి, టెన్నీస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వేసవికి ప్రత్యేక రైలు

గిద్దలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం నుంచి గిద్దలూరు మీదుగా కర్నూలు వరకు వేసవి ప్రత్యేక రైలు నడపనున్నారు. ఈనెల 15 నుంచి మే 27వ తేది వరకు ప్రతి మంగళవారం ఈ ప్రత్యేక రైలు (08545) విశాఖపట్టణంలో రాత్రి 7గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 5.08 గంటలకు గిద్దలూరు చేరి ఉదయం 9.35 గంటలకు కర్నూలు చేరుతుందని పేర్కొన్నారు. ఇదే రైలు ఈనెల 16 నుంచి మే 28వ తేదీ వరకు ప్రతి బుధవారం సాయంత్రం 4.10 గంటలకు కర్నూలులో బయలుదేరి రాత్రి 8.18 గంటలకు గిద్దలూరు చేరుకుని మరుసటి రోజు ఉదయం 8గంటలకు విశాఖపట్టణం చేరుతుందని రైల్వే అధికారులు ప్రకటించారు.

పారిశుధ్యంపై అధికారుల ప్రత్యేక దృష్టి


కాలువల్లో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

తర్లుపాడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించారు. ఈవోఆర్‌డీ సుకుమార్, పంచాయతీ కార్యదర్శి సుభాకర్‌బాబు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. మార్కాపురం డీఎల్‌పీవో వై.భాగ్యవతి గ్రామాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాన్ని చెత్తరహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎల్‌పీవో అన్నారు. ఆమె ఆదేశాలతో తర్లుపాడులోని వీధులలో మరుగు కాలువల్లో మురుగు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వీరబ్రహ్మంగారి ఆలయ వెనుక ఉన్న రోడ్డుచెత్తతో అధ్వానంగా ఉంది. మరుగు నీరు నిల్వ ఉండడంతో అధికారులు శనివారం ఎక్స్‌కవేటర్‌తో చెత్తను తొలగించి మురుగును తీసివేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లెపోగు వరాలు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఆటో బోల్తా - పలువురికి గాయాలు


రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం అంకిరెడ్డిపల్లె సమీపంలో ప్రయాణికులతో వెలుతున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న 10 మందికి పైగా ప్రయాణికులకు స్వల్పంగా గాయాలు కాగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకోవడం వల్లనే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.

బయోగ్యాస్ ప్లాంటుకు స్థల సేకరణ

కొమరోలు, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లారెడ్డిపల్లెలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాట్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. స్థలం సేకరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తహశీల్దార్ భాగ్యలక్ష్మి తన సిబ్బందితో కలసి మండలంలోని పుల్లారెడ్డిపల్లి గ్రామంలో సర్వేనెం. 259లో 94ఎకరాల ప్రభుత్వ భూములను గుర్తించారు. ఈ ప్లాంట్ ఈ ప్రాంతంలో వస్తే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉంటాయనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ముందుకు పోతున్నారు. కొమరోలు మండలంలోని రాజుపాలెం, అల్లీనగరం గ్రామపంచాయతీల్లో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటుకు భూములను అధికారులు ప్రతిపాదించారు. దీంతో పాటు బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిసారించారు.

మార్కాపురంలో దంచికొట్టిన వాన

● నిలిచిన విద్యుత్ సరఫరా


మార్కాపురంలో కురుస్తున్న వర్షం

మార్కాపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడి భగభగలతో అల్లాడిన మార్కాపురం ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. సుమారు 4.00 గంటల నుంచి మబ్బులు కమ్మి ఆకాశం మేఘావృతమైంది. తొలుత చిన్నపాటి చినుకులతో మొదలైనా సాయంత్రం 6.00 గంటల నుంచి 7.00 గంటల వరకు ఓ మోస్తారుగా వర్షం దంచి కొట్టింది. దీంతో పలు శివారు కాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై నీళ్లు నిలిచాయి. వర్షంతోపాటు గాలి కూడా తోడవడంతో చాలాచోట్ల వృక్షాలు నేలకొరిగాయి. దీంతో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 6.30 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దోర్నాలలో మోస్తరు వర్షం

పెద్దదోర్నాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దోర్నాలలో శనివారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. అయితే ఉరుములు, మెరుపులు, పిడుగుల శబ్దాలతో కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. వారంరోజులుగా ఎండలు మండి పోతుండడంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం పదిగంటలకే ఉష్ణోగ్రతలు పెరిగి ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకారు. వర్షంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. కాగా మరోవైపు అక్కడక్కడ కోతలు చేసిన మిరపకాయలు కల్లాల్లో తడుస్తాయనే భయంలో రైతులు ఆందోళన చెందారు. పంటను కాపాడుకునేందుకు టార్పాలిన్ పట్టలు కప్పారు.

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థుల సత్తా

● కళాశాలల వారి ఫలితాలను వెల్లడించిన ప్రిన్సిపాళ్లు ● ప్రతిభ చూపిన విద్యార్థులకు పలువురి అభినందన


కుటుంబ సభ్యులతో చాతుర్య

కంభం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శనివారం ప్రకటించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్ష ఫలితాలలో కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం హెచ్‌ఈసీ విభాగంలో తమ్మినేని చాతుర్య 980/1000 మార్కులు సాధించి కళాశాలకు గుర్తింపు తెచ్చారు. ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ సైమన్‌విక్టర్ అభినందించారు. ఇంటర్ అడ్మిషన్ సమయంలో సైన్స్ గ్రూపు తీసుకోవాలని పలువురు సూచించినప్పటికీ, హెచ్‌ఈసీ గ్రూపు తీసుకుని టాపర్‌గా నిలిచారు. సివిల్స్ గ్రూప్స్ పోటీల్లో నెగ్గుతానని చాతుర్య ధీమా వ్యక్తం చేస్తోంది కాగా కళాశాల నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం 199 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 72 మంది, ద్వితీయ సంవత్సరం 127 మంది పరీక్షలు రాయగా 64 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

కంభం: ఇంటర్ ఫలితాలలో గౌతమ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సర బైపీసీ ఫలితాల్లో ఎం.త్రిలోకేశ్వరి 990/1000 టి.మేరి 989/1000 మార్కులతో తమ సంస్థకు గుర్తింపు తెచ్చినట్లు కరస్పాండెంట్ చేగిరెడ్డి రామభూపాల్‌రెడ్డి తెలిపారు. వాసవి విద్యాసంస్థల విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో ఎస్.లాస్యరెడ్డి 463 మార్కులు, బైపీసీలో బి.వి.రంగ మధుప్రియ 433 మార్కులు, సీఈసీలో టి.శ్రీలక్ష్మీచైతన్య 485 మార్కులు, ద్వితీయ సంవత్సర ఎంపీసీ విభాగంలో టి.రోషిణి 987 మార్కులు బైపీసీలో టి.శివాణి 977 మార్కులు సాధించగా కళాశాల కరస్పాండెంట్ గోళ్ళ సుబ్బరత్నం (బాబు), ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి అభినందించారు.

కమలా విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని కమలా జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ప్రతిభ కనబర్చారు. ఎంపీసీ విభాగంలో అశోక్ 465, బైపీసీ విభాగంలో షేక్ షాహిన్ 440కి 433 మార్కులు సాధించారని ప్రిన్సిపల్ సుధాకర్ తెలిపారు. రెండో సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో విష్ణుసాయి ప్రణవ్ 982, బైపీసీ విభాగంలో కిరణ్ 978 మార్కులు సాధించారని తెలిపారు.

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలో 107 మంది విద్యార్థులకు 47 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షకు 79 మంది విద్యార్థులు పరీక్షకు హజరు కాగా 56 మంది ఉత్తీర్ణులై 71శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ స్వరూపరాణి తెలిపారు.

యశ్వంత్‌నాయక్ ప్రతిభ


యశ్వంత్‌నాయక్

గిద్దలూరు : మండలంలోని బురుజుపల్లి తండాకు చెందిన బుక్కె యశ్వంత్‌నాయక్‌కు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్ష ఫలితాలలో సత్తా చాటారు. ఎంపీసీ విభాగంలో 467/470 మార్కులు సాధించాడు. యశ్వంత్‌నాయక్ తండ్రి కృష్ణనాయక్ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందగా తల్లి మంగమ్మ గిద్దలూరు బాలికోన్నత పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తోంది. తండ్రి ఆశయాన్ని, కష్టాన్ని చూసి చదువు పట్ల యశ్వంత్‌నాయక్ శ్రద్ధ పెట్టి చదువుతున్నాడు. 10వ తరగతి వరకు స్థానికంగానే చదివిన యశ్వంత్‌నాయక్ ఇంటర్మీడియట్ విజయవాడ చైతన్య కళాశాలలో చేరాడు. ఐఐటీలో సీటు సాధించడమే ధ్యేయమని పేర్కొన్నారు.

కొమరోలు విద్యార్థుల సత్తా

కొమరోలు మండలంలోని రాజుపాలెం కస్తుర్బా విద్యాలయంలో 90 శాతం ఉత్తీర్ణత సాధించారని ద్వితీయ సంవత్సరం పీవీ రేణుక 907మార్కులు, ప్రథమ సంవత్సరం విద్యార్థి పీవీ ఐశ్వర్య 405మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ మందా రోజ్‌సులోచన తెలిపారు. కొమరోలు జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి కే భూవర్షిణి 453మార్కులు, బైపీసీ విద్యార్థి అఖిల 382మార్కులు, సీఈసీ విద్యార్థి ప్రకాశ్‌రావు 378 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ కే.తబిత 949మార్కులు, బైపీసీ విద్యార్థి షేక్ జమాల్ భాష 939 మార్కులు, సీఈసీ విద్యార్థి షేక్ ముంతాజ్ 924మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ ప్రభాకర్ తెలిపారు. మండలంలోని బాదినేని పల్లి గ్రామానికి చెందిన గర్రె అజయ్‌కుమార్ 463 మార్కులు, కొమరోలులోని పసుపులేటి సౌమ్యశ్రీ ఎంపీసీలో 465 మార్కులు, మండలంలోని రెడ్డిచర్ల గ్రామానికి చెందిన బందెల స్టాన్లీ సెబాస్టిన్ 462 మార్కులు, అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన కృష్ణసాగర్‌రెడ్డి 932మార్కులు సాధించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

పొదిలి : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి సంవత్సరం 30శాతం, ద్వితీయ సంవత్సరం 55శాతం ఉత్తీర్ణత కనబరిచినట్లు ప్రిన్సిపల్ రామలక్ష్మీ తెలిపారు.

పెద్దదోర్నాల : ప్రభుత్వం శనివారం ప్రకటించిన ఇంటర్మిడియట్ పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు రాణించారు. మోడల్ స్కూల్‌కు చెందిన కే శివ గాయత్రీ ద్వితీయ సంవత్సరంలో 952 మార్కులు సాధించింది. పాఠశాలలో ద్వితీయ సంవత్సం విద్యార్థులు మొత్తం 33 మంది పరీక్షలు వ్రాయగా నూరు శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.ఎంపీసీ విభాగంలో కే శివ గాయత్రీ 1000కి 952మార్కులు సాధించింది.బైపీసీలో డీ ఫాతిమా 840 మార్కులు సాధించింది.మొదటి సంవత్సరంలో 53 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 43 మంది ఉత్తీర్ణులయ్యారు.దీంతో 82శాతం ఉత్తీర్ణత నమోదయింది.ఎంపీసీలో జీ సుజిత 402 మార్కులు,బైపీసీలో ఎం భార్గవి 398, ఎంఈసీలో ఎన్ పూజిత 377మార్కులు సాధించారు.కస్తూర్బాలో మొదటి సంవత్సరం 27 మంది విద్యార్థులు హాజరు కాగా 17 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో 62.96శాతం, ద్వితీయంలో 11 మంది రాయగా 10 మంది ఉత్తీర్ణుయ్యారు. 90.91 శాతం ఉత్తీర్ణత నమోదయింది.

వెంకటాద్రిపాలెంలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రి పాలెంలో వేంచేసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు, ఉభయదాతలు గోపాలుని వెంకట చెన్నకేశవరావు, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం ధ్వజారోహణ, అంకురార్పణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణ వేడుకలు నిర్వహించారు. గ్రామ నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అంజన్న జయంతి వేడుకలు


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లమల అటవీ ప్రాంతంలోని దద్దనాలలో వెలసిన ఆంజన్న భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం, వీరాంజనేయ స్వామి దేవాలయం, అభయాంజేయ స్వామి దేవాలయం, భక్తాంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో అర్చకులు మృత్యుంజయశాస్త్రి, మల్లికార్జునశర్మలు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు ఆందజేశారు.

యాజ్ఞికులు, అర్చకుల మధ్య వివాదం

● కొద్దిసేపు నిలిచిన అంకురార్పణ క్రతువు

● దేవదాయశాఖ, ఉత్సవ కమిటీ చొరవతో సద్దుమణిగిన వివాదం


ఉత్సవమూర్తులను ఆలయానికి తరలిస్తున్న అర్చకులు

మార్కాపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): యాజ్ఞికులు, అర్చకుల మధ్య ఏర్పడిన వివాదంతో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ క్రతువు కొంత సమయం నిలిచిపోయింది. స్థానిక లక్ష్మీచెన్నకేవస్వామి బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో స్వామివారి ఉత్సవ మూర్తులను చెన్నయ్య ఆలయం నుంచి స్థానిక కోనేటి సమీపంలోని వేణుగోపాల స్వామి దేవస్థానం సమీపంలోని మండపం వద్దకు తీసుకువస్తారు. అక్కడ కోనేటిలోంచి మృత్తికలను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అంకురార్పణకు శ్రీకారం చుడతారు. ఈ ప్రక్రియ ఆది నుంచి జరి గేది. ఆలయ ప్రధానార్చకులతోపాటు అనాది గా పెద్దపౌరహిత్యానికి చెందిన సోమయా జుల వారు కూడా క్రతువులో పాల్గొంటారు. యజ్ఞ, యాగాదులు వీరి చేతులమీదుగానే నిర్వహిస్తారు. వారిలో వేదం అభ్యసించిన వారినే అనుమతిస్తారు. ఈ పర్యాయం ఆ కుటుంబానికి చెందిన పలువురు క్రతువులో పాల్గొనేందుకు రావడంతో అర్చకులు అడ్డు చెప్పారు. వేదం చదివిన వారు మాత్రమే పాల్గొనాలని చెప్పడంతో యాజ్ఞీకుల కుటుంబానికి, అర్చకుల మధ్య సంవాదం ఏర్పడి క్రతువు నిలిచింది. శనివారం వేకువజాము వరకు ఇదే పరిస్థితి నెలకొన డంతో దేవదాయశాఖ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు చొరవ తీసుకుని వారి మధ్య సయోధ్య కుదిర్చారు. దీంతో ఉదయం 8.00 గంటల నుంచి క్రతువును ప్రారంభించి పూర్తి చేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది. స్వామివారి ఉత్సవమూర్తులకు ఇరువురు కలిసి నగరోత్సవం నిర్వహించారు.

మతసామరస్యానికి ప్రతీక నాగూర్‌మీరా స్వామి ఉరుసు

నేటి మహోత్సవానికి సర్వం సిద్ధం


ప్రత్యేకంగా అలంకరించిన దర్గా

పెద్దారవీడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పెద్దారవీడులో వెలసిన నాగూర్‌మీరా స్వామి ఉరుసు మహోత్సవం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. కుల, మతాలకు అతీతంగా ఉరుసు మహోత్సవం నిర్వహించడం గ్రామస్థులకు సంప్రదాయంగా మారింది. పురాతన కాలంలో నాగూర్ మీరా స్వామి జీవిత విధానం అందరికీ ఆదర్శనీయమని, అందుకే ఆయనను దేవునిగా కొలుస్తుంటారని పెద్దలు చెబుతున్నారు.


మొక్కులు తీర్చుకోవడానికి వస్తున్న భక్తులు

నాగూర్‌మీరా స్వామి సమాధి

నాగూర్‌మీరా స్వామి వద్ద మొక్కులు మొక్కుకుంటే ఆ పని నెరుతుందని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా పిల్లలు పుట్టనివారు, మానసిన రుగ్మతలతో బాధపడుతున్నవారికి నాగూర్‌మీరా స్వామికి మొక్కుకుంటే సమస్యలు తీరుతాయని విశ్వాసం. అటువంటి సమస్యలతో బాధపడుతున్నవారు స్వామికి గత ఏడాది మొక్కుకొని ఈ ఏడాది మొక్కులు తీర్చడానికి తరలివస్తారు.

పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలు

పెద్దారవీడులో నాగూర్‌మీరా స్వామి ఉరుసు మహోత్సవానికి అధికార టీడీపీ, ప్రతి పక్ష వైసీపీ నాయకులు పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తు న్నారు. టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో రెండు, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రెండు పాటకచేరీలు ఏర్పాటు చేస్తున్నారు.

పటిష్టమైన భద్రతా చర్యలు

నాగూర్‌మీరా స్వామి ఉరుసు మహోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఎస్సై అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్సైలు, 50 మంది కానిస్టేబుళ్లతో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

వేడుకగా ధ్వజారోహణ


సప్తకోటేశ్వర స్వామి



హాజరైన భక్తులు, భేరి మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 12 ఆంధ్రజ్యోతి: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్న కేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శని వారం స్వామి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేతుడై చెన్నకేశవస్వామి భేరీ మండపంలో వేంచేపు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో గరుడ ధ్వజారోహణ నిర్వహించారు. యాగ్ని కులు సోమయాజుల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు, బలి హరణ నిర్వహించారు. పూజల అనంతరం గరుడ ప్రసాదం సంతానం లేని భక్తులకు పంచిపెట్టారు. ఉభయదాతలుగా మంచికంటి రాజా, సుబ్రహ్మణ్యం, చాటకొండ చంద్రశేఖర్, నాగరాజులు వ్యవహరించారు. ఈవో గొల మారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


పార్వతీదేవి మూలవిరాట్

నేడు కల్యాణం

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం స్వామికి కళ్యాణం నిర్వ హించనున్నారు. రాయబారం, ఎద ర్కోలా, సూర్య వాహన సేవ అనంతరం స్వామికి కల్యాణ ఘట్టాలు నిర్వహంచనున్నారు.

శతకోడులో చతుర్ధ ద్వార ప్రదక్షిణ

పుల్లలచెరువు : పుల్లలచెరువు మండలం శతకోడులో వెలసిన సప్తకోటేశ్వరస్వామికి త్రిపురాంతక క్షేత్ర దేవస్థానం ఆధ్వర్యంలో చతుర్ధ ద్వార ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం చైత్ర పౌర్ణమి సందర్భంగా త్రిపురాంతక క్షేత్ర ఆలయ ఉత్తరద్వారం అయిన శతకోడులో అర్చకులు, సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ అర్చకులు విశ్వం స్వామి సప్తకోటేశ్వర స్వామికి అభిషేకములు నిర్వహించారు. పార్వతిదేవికి కుంకుమ అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రి యజ్ఞం


గాయత్రి యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

గిద్దలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రిమాత దేవాలయంలో గాయత్రి యజ్ఞం వైభవంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న ఈ గాయత్రి యజ్ఞంలో భక్తులు సామూహికంగా పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గాయత్రి పరివార్ సభ్యులు పి.హనుమంతరెడ్డి, వంగల ప్రసూన, వడ్డె వీరారెడ్డి, అంజనికుమార్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షంషేర్ అలీబేగ్ సేవలు అభినందనీయం


చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మీర్జాషంషీర్ అలీబేగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. స్థానిక కోర్టు కూడలిలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భం గా రాంబాబు మాట్లాడుతూ... వేసవిలో ప్రజల దాహర్తి తీర్చేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డా.మీర్జాషంషీర్ అలీబేగ్, వైసీపీ రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం కార్యదర్శి మేడా భద్రీనాథ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ ఇస్మాయిల్, రెడ్‌క్రాస్ సొసైటీ మార్కాపురం చైర్మన్ డా. చెప్పల్లి కనకదుర్గ, బీసీ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్, జామీయా మస్జీద్ ముతవల్లి మీర్జా సబ్దర్ అలీబేగ్, మొఘల్ ఫరతుల్లా బేగ్, పఠాన్ ఆసీఫ్ ఖాన్, షంషాల్ ఉలూమ్ కాలేజీ చైర్మన్ మీర్జా జాఫర్ అలీబేగ్, ఫౌండర్ చైర్మన్ మీర్జా ఉస్మాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌చట్ట సవరణలను ఉపసంహరించుకోవాలి

● సీపీఐ నాయకుల డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

మార్కాపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో కోట్లాదిమంది ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణల చట్టాని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ, ఇన్సాఫ్, ఎంపీజే నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలో ఆందోళన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం తొలినుంచి ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్నారు. అందులో బాగంగానే వక్ఫబోర్డు సవరణ బిల్లును తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్‌రజాక్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే కాశిం, సీపీఐ పట్టణ కార్యదర్శి చిత్తారి పెద్దన్న, నాయకులు దుప్పట్ల కాశయ్య, శేఖర్, ఎంపీజే నాయకులు ఎస్‌కే రసూల్, మదీన మసీద్ ముతవల్లీ షేక్ కరిముల్లా, గఫూర్, సీఎం ఖాశిం, ఎర్ర ఖాశింలు పాల్గొన్నారు.

మూడు కిలోల కణిత తొలగింపు

గిద్దలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విరంచి వైద్యశాలలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. అనుమలవీడుకు చెందిన మహబూబ్‌బీ కడుపులో ఉన్న 3 కిలోల కణితను బయటకు తీశారు. మహబూబ్‌బీ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటుండగా కడుపునొప్పితో బాధపడుతూ అక్కడే వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఆపరేషన్‌కు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని గిద్దలూరులోని విరంచి వైద్యశాలకు చెందిన డాక్టర్ మేడిశెట్టి సావిత్రిని సంప్రదించారు. దాంతో డాక్టర్ సావిత్రితోపాటు డాక్టర్ విరించి యాదవ్, డాక్టర్ గ్రీష్మయాదవ్‌ల బృందం ఆపరేషన్ చేసి ప్రమాదకరంగా ఉన్న ఈ కణితను వెలికితీసి కడుపునొప్పి నుంచి ఉపశమనం కల్పించారు.

గుండెపోటుతో టీడీపీ యువ నాయకుడి మృతి

పొదిలి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మాదాలవారిపాలెం గ్రామ టీడీపీ యువనాయకులు పెమ్మని రాజు శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని రాష్ట్ర పర్యాటకశాఖ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. టీడీపీలో కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేశాడన్నారు. ఈయన వెంట జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పొల్లా నరసింహారావు, గ్రామ, టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు

- ప్రతిభచాటిన విద్యార్థులు
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలు రాణింపు

కనిగిరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రైవేటు కళాశాలలకు దీటుగా నిలిచారు. శనివారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో కనిగిరి ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రమణారెడ్డి తెలిపారు. పరీక్షలకు హాజరైన 95 మందిలో 64 మంది ఉత్తీర్ణులయ్యారు.



గడా కీర్తన, 990 మార్కులు

ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని విజేత కళాశాలకు చెందిన విద్యార్థులు విజయ దుందుభి మ్రోగించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో గడా కీర్తన 990 మార్కులు, బైపీసీలో షేక్ నజ్మా 989 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విజేత కాలేజి చైర్మన్ అరుణోదర్, అధ్యాపకులు అభినందించారు.

అలాగే, ఎమ్మెస్సార్ విద్యార్థిని షేక్ అస్మిన్ ఎంపీసీలో 988 మార్కులు, అంపాబత్తుని తేజస్విని 987 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో మండాది వెంకటరీతిక 464 మార్కులు, బైపీసీలో కుర్రా గురువర్ధన 430 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి, కళాశాల ట్రస్ట్ చైర్మన్ మాగుంట రాఘవరెడ్డి అభినందించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో బీఆర్ ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాలకు చెందిన సీహెచ్ రీత్విక్ 465 మార్కులు, ఎస్‌కే వదూద్, వి.శ్రీరామ్, రిషితలు 464 మార్కులు సాధించారు. బైపీసీలో డి.నాగగంగ 434 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఉన్నం భాస్కర్‌రావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్‌లు షియాజ్, నరేంద్ర, రాంబాబు అభినందించారు.

అక్షర విద్యార్థులు ఉత్తమ ఫలితాలు

పామూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో పామూరు అక్షర కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కరస్పాండెంట్ కదిరి బాబురంగారావు తెలిపారు, సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో షేక్ ఆకీబ్ 988మార్కులు, నాగ వెంకట అంజలికుమారి 985, కొర్రపాటి మానస 985 మార్కులు సాధించారు. బైపీసీలో షేక్ అఫ్షీయ 950 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.అంజాన్ సాయి, ఎం.నవీన, పి.నాగమణి 460 మార్కులు సాధించారు.



షేక్ అకీబ్, 988 మార్కులు

దర్శి విద్యార్థులకు అత్యధిక మార్కులు

దర్శి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో దర్శి కళాశాలల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. దర్శికి చెందిన గుర్రం వెంకటలోకేష్ పట్టణంలోని మాష్టర్స్ కాలేజీలో ఇంటర్ చదువుతన్నాడు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 466 మార్కులు సాధించాడు. అలాగే, పట్టణంలోని ఝాన్సీ మహిళా జూనియర్ కాలేజీ విద్యార్థిని దొండ్లేటి శైలజ ఎంపీసీలో 466 మార్కులు సాధించారు. పొదిలి మండలం కోష్టాలపల్లికి చెందిన శైలజను కళాశాల అధినేతలు డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ కోటిరెడ్డి దంపతులు అభినందించారు.



గుర్రం వెంకటలోకేష్, 466 మార్కులు



డి.శైలజ, 466 మార్కులు

ప్రభుత్వ కళాశాలల్లో పెరిగిన ఉత్తీర్ణత

పామూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో పామూరు ప్రభుత్వ, కస్తూర్బా కళాశాల విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్‌లు రాజశేఖర్, కటకం సజన తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో 39 మంది పరీక్షలు రాయగా 24 మంది ఉత్తీర్ణులయ్యారు. జూనియర్ ఇంటర్‌లో 58 మందికిగాను 28 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో సీనియర్ ఇంటర్‌లో 11 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. జూని యర్ ఇంటర్‌లో 26 మందికిగాను 17 మంది ఉత్తీర్ణులయ్యారు.

అలాగే, సీఎస్‌పురం కేజీబీవీలో సీనియర్ ఇంటర్‌లో 18 మందికి గాను 12 మంది, జూనియర్ ఇంటర్‌లో 18 మందికి గాను 13 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ షేక్ రేష్మా తెలిపారు. శీలంవారిపల్లి గ్రామంలోని కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాల ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ మూరం మస్తానయ్య, డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ ఇరగని చలపతిరావు, అధ్యాపకులు అభినందించారు.

దొనకొండలో.. దొనకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభచాటారు. ఇంటర్ రెండో సంవత్సరం 21 మంది విద్యార్థులకుగాను 20 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 54 విద్యార్థులకుగాను 47 మంది ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరంలో ఐదుగురు బాలికలకూ ఉత్తీర్ణత సాధించగా, మొదటి సంవత్సరంలో 28 మందికిగాను 17 మంది ఉత్తీర్ణులయ్యారు.



కనిగిరి: విద్యార్థులను అభినందిస్తున్న ఆక్స్‌ఫర్డ్ చైర్మన్, డైరెక్టర్‌లు

పీసీపల్లిలో.. పీసీపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 84శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ, సీఈసీ కలిపి మొత్తం 25మంది పరీక్షలు రాయగా 21మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 53మందికిగాను 23మంది ఉత్తీర్ణులయ్యారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరరావు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 77 మందికిగాను 53 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 63 మందికిగాను 45 మంది ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీలో రెండో సంవత్సరంలో 27 మందికిగాను 14 మంది, మొదటి సంవత్సరంలో 12 మందికిగాను నలుగురు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రత్యేకాధికారి ఆవుల సునీత తెలిపారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో వీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కొండపల్లి ఆంజనేయులు శనివారం తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 35 మందికి 33 మంది, ప్రథమ సంవత్సరంలో 40 మందికిగాను 24 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

కల్తీపాల తయారీదారులపై చర్యలకు సన్నద్ధం



తాళ్లూరులో పాల విక్రయకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ మల్లికార్జునరావు

- డెయిరీలను తనిఖీచేసిన పోలీసులు

దర్శి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో కల్తీపాలు తయారుచేసే వారిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు సన్నద్ధమవుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని హరించే కల్తీపాల తయారీని పూర్తిగా నివారించాలనే లక్ష్యంతో సీఐ వై.రామారావు, ఎస్ఐ ఎం.మురళీ మండలంలోని అనేక పాల కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. సీఐ మారువేషంలో వెళ్లి డెయిరీ ఫారంలను పరిశీలించారు. మండలంలోని దర్శి, ఎర్రోబనపల్లి, కొత్త వెంకటాపురం, రాజంపల్లి తదితర గ్రామాల్లో కేంద్రాలను పరిశీలించి పూర్తి సమాచారం సేకరించారు. కొంతమంది వ్యక్తులు కల్తీపాలు తయారుచేస్తునట్లు గుర్తించినట్లు సమాచారం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ కల్తీపాలు తయారుచేసి అక్రమార్కులు లబ్ధి పొందుతున్నారు. కల్తీపాల తయారీలో యూరియా, సల్ఫర్‌తో పాటు పాలపొడి కొంచెం కలిపి అధిక మొత్తంలో కల్తీపాలు తయారుచేస్తున్నారు. ఈ కల్తీపాలను కొంతమంది పాలశీతల కేంద్రాలు నిర్వహించే పెద్దలు యథేచ్ఛగా కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు పాల విక్రయ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. పలు రకాలుగా కల్తీపాలు ప్రజలకు చేరుతున్నాయి. ఆ పాలు, పెరుగు తింటున్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆహార భద్రతాశాఖ అధికారులు మాత్రం పట్టించుకో వటం లేదు. ఎప్పుడో మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కల్తీపాలతో ఆరోగ్యాలు చెడిపోతున్నాయని ప్రజలు ఆందోళనలు చెందుతున్న తరుణంలో దర్శి పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించి నియంత్రీకరణకు శ్రీకారం చుట్టారు. అనంతరం సేకరించిన సమాచారం ద్వారా పలువురు వ్యక్తులు కల్తీపాలు తయారుచేస్తున్న విషయాన్ని గుర్తించినట్లు తెలిసింది. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

కల్తీ పాలను తయారుచేస్తే ఉపేక్షించం

తాళ్లూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కల్తీపాలను తయారుచేస్తే ఉపేక్షించమని ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు హెచ్చరించారు. ఎస్పీ ఆదేశానుసారం దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ రామారావు సూచనలమేరకు గ్రామాల్లో కల్తీపాలు తయారు చేస్తున్న కేంద్రాలను గుర్తించేందుకు శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొందరు పాలకేంద్రాల నిర్వాహకులు అధికంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మండలంలో అధికంగా పాలు విక్రయించే గ్రామాలపై ప్రత్యేకదృష్టి సారించినట్లు తెలిపారు. ఎక్కువపాల విక్రయించే కేంద్రాలను తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. పలుగ్రామాల్లో కల్తీపాలు తయారు చేసి విక్రయిస్తుండగా అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసినా మార్పు రావటం లేదన్నారు. కల్తీపాలు తాగితే ప్రజలు అనార్యోగం పాలవుతున్నారని అన్నారు. పాలవిక్రయదారులు కల్తీ విధానాన్ని విడనాడాలన్నారు. కల్తీపాలు తయారు చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు

ముండ్లమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. శనివారం సాయంత్రం పోలీసు స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈతనిఖీల్లో మందుబాబు పట్టుబడటంతో కౌన్సెలింగ్ ఇచ్చారు. మందు తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపటమే కాక వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. మందు బాబులు తాగి వాహనం నడపటం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, మహేష్, ఎస్కేల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

దొనకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టిన కూలీలకు మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 12,900 జాబ్‌కార్డులు ఉన్నాయి. వ్యవసాయ పనులు పూర్తి కావటంతో వేలమంది కూలీలు ఉపాధిహామీ పథకం పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈపథకంలో పనులు చేపట్టిన కూలీలకు మూడు నెలలుగా దాదాపు రూ.5 లక్షల వరకు వేతనాలు మంజూరు కావాల్సి ఉంది. పలు గ్రామాల్లో ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులను నమ్ముకొని స్థానికంగా ఉండిపోయారు. ప్రతిరోజు పనులు చేపట్టినప్పటికీ సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవటంతో అప్పులు చేసి జీవనం సాగించాల్సి వస్తుందని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల కొద్దీ బిల్లులు చెల్లించకపోతే తాము ఏవిధంగా బతకాలని కూలీలు వాపోతున్నారు. పనుల కోసం వలస వెళ్లకుండా ఉపాధి పనులకు వెళుతుండగా సకాలంలో వేతనం రాక పడరాని పాట్లు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి తమకు రావాల్సన పెండింగ్ వేతనాల మంజూరుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇకపై పెండింగ్ లేకుండా వేతనాలు సకాలంలో మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



చందలూరులో వర్షానికి దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అకాల వర్షం, ఈదురు గాలులకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. రెండురోజుల క్రితం ఈదురుగాలులు, వర్షాలకు మండలంలోని చందలూరు, బసిరెడ్డిపల్లి, అబ్బాయిపాలెం, మారెడ్డిపల్లి, తూర్పుచౌటపాలెం తదితర గ్రామాల్లో బొప్పాయి, పొగాకు, మిర్చీ తదితర పంటలు దెబ్బతిన్నాయి. బొప్పాయి తోటలు కాపుదశలో ఉన్నాయి. ఈదురు గాలులకు చెట్లు నేలమట్టం కావటంతో పంట పూర్తిగా పోయింది. ఈనేపథ్యంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ దెబ్బతిన్న పంటలను పరిశీలించి బాధిత రైతులను ఓదార్చారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపాలని స్థానిక అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. సీఎం చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెనాయుడులను కలిసి పరిహారం అందించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఆమె వెంట టీడీపీ, జనసేన నాయకులు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

కాగా, మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో శనివారం జరిగిన సీతారామాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలోని సామంతపూడి గ్రామంలో జరిగిన నాగారబమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు గంగిరెడ్డికి నివాళి

టీడీపీ దర్శి పట్టణ నాయకుడు గంగిరెడ్డి మృతి బాధాకరమని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, పుల్లలచెరువు చిన్నా, దిరిశాల రామకృష్ణ, వెంకటరావు, మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

టీటీడీపై తప్పుడు ప్రచారం తగదు!



మాట్లాడుతున్న ఆర్యవైశ్య ప్రముఖులు ఐవీ నారాయణ

కనిగిరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తిరుమల, తిరుపతి దేవస్థానంపై అసత్య ప్రచారాలు చేయడం తగదని టీడీపీ ఆర్యవైశ్య ప్రముఖులు ఐవీ నారాయణ అన్నారు. టీటీడీ గోశాలలో గోవులు మరణించాయంటూ భూమన చేసిన అసత్య వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ అపవిత్రమైందన్నారు. వైసీపీ పాలనలో తప్పుడు పనులు చేసి టీటీడీని అగౌరవపర్చారని అన్నారు. స్వామివారి ఆగ్రహానికి గురై అధికారం కోల్పోయినా ఇంకా వైసీపీ నేతలకు జ్ఞానోదయం కావటం లేదన్నారు. తిరుమలలోని గోశాలలో గోవులు మరణించాయంటూ మాజీ చైర్మన్ కరుణకర్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేస్తూ హిందువుల మనోభావాలపై విషం గక్కుతున్నారన్నారు. గోవులు మరణించాయంటూ పాత వీడియోలను చూపిస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కూటమి పాలనలో టీటీడీ సంపూర్ణ సంప్రోక్షణ గావించ బడిందన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా భూమన మాట్లాడటం హిందువులను రెచ్చగొట్టేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు.

బీసీ నాయకుడు కేవీఎస్ గౌడ్ మాట్లాడుతూ కోటిమంది దేవతలతో సమానంగా హిందువులు పూజింపబడే గోమాతలపై కూడా వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టకు భంగం కల్గిస్తున్నారన్నారు. టీటీడీలో 260 మంది సిబ్బంది గోశాలలోని గోవుల పరిరక్షణలో ఉన్నారన్నారు. టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు రోషన్ సంధాని మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్‌గా ఉన్న కరుణాకర్‌రెడ్డి తాళిబొట్ల కుంభకోణం నుంచి ప్లాస్మా టీవీలు, దర్శనం టిక్కెట్‌ల కుంభకోణం, డాలర్ల మాయం చేశారని ధ్వజమెత్తారు. తప్పుడు పనులుచేసి కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయాలని చూస్తే ఊరుకోనేది లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ నేతలు టీటీడీపై దుష్ప్రచారం లేపి హిందువుల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత అంటగట్టాలని చూస్తున్నారన్నారు. దానిని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలన్నారు.

సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, ఫిరోజ్, తిరుపాలు, సిద్దాంతి బారాయిమాం, బుల్లా బాల బాబు, నంబుల కొండయ్య, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, స్వప్న, తులసి, పార్వతమ్మ, ధనలక్ష్మి, అమ్ములమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి జాతర



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

ముండ్లమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం, పసుపుగల్లు గ్రామాల మధ్య వేంచేసి ఉన్న పాటిమీద ప్రసన్నాంజనేయ స్వామి జాతర మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది హనుమాన్ జయంతి రోజున ఉత్సవం నిర్వహిస్తుంటారు. ఉదయం మొక్కుబడులు ఉన్న భక్తులు పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని స్వామికి సమర్పించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి జాతరలో ప్రధాన పాత్ర పోషించి అన్నదానం నిర్వహిస్తున్న పెనుమచ్చ కృష్ణ రాజు, సతీమణి లీలామణి, కుమారుడు రవికుమార్ రాజు, ప్రసన్నరాణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. పసుపుగల్లు గ్రామానికి చెందిన కానాల వంశస్థులు మొక్కుబడి ప్రభను జాతరకు తీసుకువచ్చారు. ఐదు వేల మందికి పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉమామహేశ్వర అగ్రహారంలో ఉత్సవ విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కమలాకర్ బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రధాన అర్చకులు ప్రసాద్, వెంకటేశ్వరరావు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మద్యం అమ్మకాల్లో నిబంధనలు బేఖాతర్

కనిగిరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల్లో నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారు. సంబంధితశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడపడితే అక్కడ బెల్టుషాపుల్లో జోరుగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. కనిగిరిలో సమయపాలన పాటించటం లేదు. బ్రాందీషాపుల వద్ద మరోమార్గాన్ని ఏర్పాటుచేసుకుని రాత్రింబవళ్ళు విక్రయిస్తున్నా అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది మద్యం షాపుల నిర్వాహకులు వాహనాలను ఏర్పాటుచేసుకొని మారుమూల గ్రామాలకు తరలిస్తున్నారు. వయస్సు పరిమితి నిబంధనలను కూడా మద్యం షాపుల నిర్వాహకులు పాటించటం లేదు. రాత్రి వేళల్లో నగర శివారుల్లో రోడ్ల వెంట మద్యం సేవిస్తూ వాహనదారులకు భయాందోళనలు కల్గిస్తున్నారు. మద్యం తాగిన అనంతరం బైక్‌లపై స్వగ్రామాలకు వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న మద్యం షాపులు, రెస్టారెంట్‌లపై సంబంధితశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు వైట్‌బర్లీ దగ్ధం

ముండ్లమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వరఅగ్రహారంలో శనివారం ఉదయం చింతల పెదకోటిరెడ్డికి చెందిన వైట్‌బర్లీ పొగాకు పందిరి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. పందిరిలో ఉన్న 15 క్వింటాళ్ళ పొగాకు పూర్తిగా దగ్ధమైంది. పెదకోటిరెడ్డి నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వైట్‌బర్లీ పొగాకు సాగుచేశాడు. పొలంలోనే పందిరి వేసి ఎండ బెట్టాడు. దాని పక్కనే బీడు భూములు ఉన్నాయి. ఓరైతు అందులో ఉన్న గడ్డి కాలిపోయేందుకు మంటవేశారు. మంటలు పక్కనే ఉన్న పొగాకుకు అంటుకొని పందిరితో పాటు 15 క్వింటాళ్ళ పొగాకు అగ్నికి ఆహుతైంది. రూ.2.50 లక్షల మేర నష్టం వాటిల్లింది.

ఘనంగా బుద్ధ పూర్ణిమ



జగన్నాథపురం వద్ద బుద్ధ పూర్ణిమ వేడుకలు జరుపుతున్న బౌద్ధ భిక్షువులు

కురిచేడు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం పమర కాశీపురం పంచాయతీపరిధిలో ఉన్న జగన్నాథపురం బౌద్ధ క్షేత్రం వద్ద శనివారం బుద్ధ పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీలంక, జపాన్ దేశాల నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్థానికులతో బుద్ధుని జీవిత విశేషాలు, ఆయన బోధనల గురించి వివరించారు. హీనాయాన క్షేత్రమైన జగన్నాథపురం బౌద్ధ క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తామని స్థానికులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బౌద్ధ భిక్షువులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు ముండ్లమూరులో ఉచిత వైద్యశిబిరం

ముండ్లమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉన్నం చారిటబుల్ ట్రస్ట్, విజయవాడ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఉన్నం నరసింహారావు, రామాంజనేయులు తెలిపా రు. పెదకాకానికి చెందిన శంకర్ కంటి వైద్యశాల డాక్టర్లు ఉచిత వైద్య శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

మసీదుకు ఫ్యాన్‌లు బహూకరణ

పీసీపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నేరేడుపల్లి గ్రామంలో ఉన్న మసీదుకు దాతలు ఫ్యాన్‌లు, కుర్చీలను బహూకరించారు. ఆగ్రామానికి చెందిన వజ్జా చంద్రయ్య రైల్వేలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. గ్రామంలోని ముస్లిం పెద్దలు మసీదుకు ఫ్యాన్‌లు అందజేయమని ఆయనను కోరారు. రైల్వేలో తన మిత్రులను సంప్రదించి రూ.15 వేల విలువైన నాలుగు ఫ్యాన్‌లు, కుర్చీలు, గోడ గడియారాలను సమకూర్చారు. వీటన్నింటిని శనివారం మసీదులో ఉండే పెద్దకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లా మల్లికార్జున్, స్థానిక పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు ఎస్కేపీఎం గౌస్, అబ్దుల్లా, వి.శ్రీను తదితరులు పా ల్గొన్నారు.

రేపు కురిచేడులో గ్రామ సభ

కురిచేడు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కురిచేడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు గ్రామ సభ జరుగుతుందని సర్పంచ్ కేసనపల్లి క్రిష్ణయ్య తెలిపారు. గ్రామ సభలో పౌర సేవలు, వ్యవసాయ పనులు, విద్యుత్, ఆరోగ్య శాఖపై సమీక్ష జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ సభకు ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు హాజరవుతారని తెలిపారు. అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని ఆయన కోరారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు!

పామూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): యువకులు మత్తుపదార్థాల బారినపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్ఐ టి.కిశోర్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలో యువకులకు మత్తు పదార్థాలు, క్రికెట్ బెట్టింగ్ లపై కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

పామూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార వారోత్సవాల్లో బాగంగా శనివారం మండలంలోని వగ్గంపల్లి ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యారవ శ్రీనివాస్ పాల్గొని లోగోను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరాచేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేసి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి, సర్పంచ్ డి.సుబ్బయ్య, బి.వెంకటేశ్వరరెడ్డి, షేక్ కావేరి రసూల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ అపహరణ

దర్శి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): దర్శి ఎన్ఎపీ చెరువుకు నీరు పంపింగ్ చేసేందుకు ఉపయోగిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రాగితీగను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సాగర్ జలాలు విడుదలైనప్పుడు ఎన్ఎపీ చెరువుకు మోటార్ల ద్వారా నీరు పంపింగ్ చేస్తారు. సుమారు రూ.6లక్షల విలువ చేసే రాగి తీగను దొంగలించటంతో స్కీమ్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఏఈ హనుమాన్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు.





హెలీప్యాడ్ ల్యాండింగ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ

ముస్తాబవుతున్న పొన్నెకల్లు

- రేపు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్రస్థాయి అంబేద్కర్ జయంతి వేడుకలకు సిద్ధం
- మార్గదర్శి-బంగారు కుటుంబాలతో సీఎం ముఖాముఖీ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

తాడికొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడులకు తాడికొండ నియోజకవర్గంలోని పొన్నెకల్లు గ్రామం ముస్తాబవుతుంది. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. దీంతో గ్రామంలో అధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని రెండు ఎస్సీ కాలనీల మధ్యలో ముఖ్యమంత్రి సభా వేదికను నిర్ణయించిన అధికారులు ఇప్పటికే పనులు చేపట్టారు. అంబేద్కర్ వేడుకలకు సంబంధించి నాలుగు రోజులుగా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకల్లో పీ-4 కార్యక్రమాన్ని నిర్వహించి మార్గదర్శి-బంగారు కుటుంబాలతో సీఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. ఇందుకు సంబంధించి కూడా అధికారులు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే హెలీప్యాడ్ పనులను పూర్తి చేశారు. అతిథితులకు, గ్రామస్తులకు భోజన ఏర్పాట్లకు ప్రత్యేకంగా టెంట్లను సిద్ధం చేస్తున్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలను అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కూడా చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆదివారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తి అవుతాయని ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ శనివారం విలేకర్లకు తెలిపారు. శనివారం ఏర్పాట్లను ఆయన గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. శానిటేషన్, వాహనాల పార్కింగ్, బారికేడింగ్ పనులు సజావుగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీపీవో నాగసాయి, ఆర్అండ్‌బీ డీఈ బీ.చిన్నయ్య, తహసీల్దార్ మెహర్ కుమార్, ఎంపీడీవో సమతా వాణి, ఈవోపీఆర్‌డీ సాయిలీల, పంచాయతీ సెక్రటరి జానీ పాల్గొన్నారు. సీఎం సభా ప్రాంగణం, హెలీప్యాడ్, అంబేద్కర్ విగ్రహం వద్ద పనులను శనివారం ఎస్పీ సతీష్‌కుమార్‌పరిశీలించారు. సీఎం భద్రత సిబ్బంది, స్థానిక పోలీసులకు ఆయన పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు.



సిద్ధమవుతున్న సభా ప్రాంగణం



ఏర్పాట్లను పరిశీస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

15 నుంచి వేట నిషేధం

మత్స్యకారులకు నోటీసులు

చినగంజాం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రాదేశిక సముద్ర జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు తూర్పు బంగాళా ఖాతంలో వేట నిషేధించినట్లు మత్స్యశాఖ అభివృద్ధి కారంచేడు ఇన్‌చార్జి అధికారి ఎం.రవీంద్ర తెలిపారు. వేట నిషిద్ధ కాలాన్ని కచ్చితంగా అమలు చేయడానికి మత్స్యశాఖ, కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేట నిషేధం వల్ల చేపలు, రొయ్య జాతుల గుడ్ల సంరక్షణ, వాటి సంతతి పెరుగుదల ద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరత సాధ్యమన్నారు. మత్స్యకారులు వేట నిషేధ ఉత్తర్వులను అనుసరించి సముద్ర జలాల్లో మర, మోటారు పడవల ద్వారా చేపల వేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాలన్నారు. వేట నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే రాష్ట్ర సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994 సెక్షన్ 4ను అనుసరించి శిక్షార్హులన్నారు. జరిమానాతో పాటు ప్రభుత్వం అందించే అన్ని రకాల రాయితీ సౌకర్యాలను నిలిపేస్తామన్నారు. మత్స్యకార గ్రామాల్లోని సొసైటీ అధ్యక్షులకు, సాగర మిత్రాలకు, గ్రామ కాపులకు, పెద్దలకు నిషేధానికి సంబంధించి మత్స్య సహాయకులు ఎస్.పుల్లారావు, డి.రామారావు, ఎస్‌కే కాలేషా, డి.ప్రతిభ, కే.ప్రమీల, నోటీసుల ద్వారా శనివారం సమాచారం అందజేశారు.



గ్రామస్తులకు నోటీసులు అందజేస్తున్న గ్రామ మత్స్యకార సహాయకులు

ఇంటర్‌లో.. 17వ స్థానం

- గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు
- సీనియర్లు 79, జూనియర్లు 65 శాతం ఉత్తీర్ణత
- మూడు ప్రభుత్వ కళాశాలలు నూరు శాతం ఫలితాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. శనివారం మొదటి, రెండో సంవత్సర ఫలితాలను ప్రభుత్వం విడుదల చేయగా జిల్లా 17వ స్థానం దక్కించుకుంది. జిల్లా విద్యార్థులు గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించారు. గత ఏడాది జిల్లా 14వ స్థానంలో నిలవగా ఈ ఏడాది రెండు శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించడంతో 12వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 7,420 మంది విద్యార్థులు హాజరుకాగా 5,837 మంది ఉత్తీర్ణతతో 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులు జిల్లాలో మొత్తం 9,146మంది పరీక్ష రాయగా 5,907 మంది ఉత్తీర్ణత సాధించారు. పాస్ పర్సంటేజి 65 శాతంగా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే పాస్ పర్సంటేజీలో గణనీయంగా పెరుగుదల నమోదైంది. గతేడాది జూనియర్ ఇంటర్‌లో 60 శాతం నమోదు కాగా అది ఇప్పుడు 65 శాతమైంది. సీనియర్ ఇంటర్‌లో గతేడాది 71 శాతం కాగా ఈ సంవత్సరం అది 79 శాతానికి ఎగబాకింది. ఇక జిల్లాలోని మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఈ ఏడు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించాయి. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బల్లికురవలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో బాపట్లలోని డెఫ్ అండ్ డంబ్ కళాశాల, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో పర్చూరు మండలంలోని నూతలపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల నూరుశాతం ఉత్తీర్ణత సాధించింది. చీరాల మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కె.ధాత్రిశ్రీ బైపీసీలో 975 మార్కులు సాధించింది. బాపట్లలోని ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థి 989 మార్కులు సాధించారు.

పేదింట ఆణిముత్యం.. సమీరా

పర్చూరు: పర్చూరు బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాల విద్యార్థిని షేక్ సమీరా ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన సమీరా ఎంపీసీలో 975 మార్కులు సాధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి స్థానంలో నిలిచింది. సమీరా గుంటూరు జిల్లా పెద్దనందిపాడు మండలం కొప్పర్రు గ్రామానికి చెందిన జాన్‌బాబు, రిహానా దంపతుల కుమార్తె. కాగా స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో కూడా సమీరా 547 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. వ్యవసాయ పనులు చేసుకుంటూ కుమార్తెను ఉన్నతంగా చదివించాలన్న సంకల్పంతో నాగులపాలెంలోని పెద్దమ్మ వద్ద ఉంచి అక్కడి ప్రభుత్వ కళాశాలలో చేర్పించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన సమీరాను ప్రిన్సిపాల్ శేషకుమారి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



ప్రథమ స్థానం సాధించిన సమీరాకు స్వీట్ తినిపించి అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ శేషకుమారి, సిబ్బంది

గాలింపులో గందరగోళం

- పలు కేసుల్లో నిందితుడి కోసం తెలంగాణ నుంచి వచ్చిన పోలీసులు
- శుక్రవారం రాత్రి వాడరేవులోని గెస్ట్ హౌస్ సమీపంలో రక్తపు మరకలతో ఉన్న పాత నేరస్థుడు
- ఎస్సైలు, ఐడీ పార్టీ కానిస్టేబుల్‌పై ఆరోపణల వీడియో వైరల్
- బాపట్ల వైద్యశాలలో చికిత్సకు చేరి అక్కడ నుంచి పరార్
- అసలు ఏం జరిగింది ? మహేష్ ఎక్కడున్నాడు ? అనే కోణంలో దర్యాప్తు

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పలు కేసుల్లోని నిందితుడు కోసం తెలంగాణకు చెందిన పోలీసులు గాలింపు నిర్వహించగా గందరగోళ వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని ఈపూరుపాలెం పద్మనాభునిపేటకు చెందిన ఆరికాటి మహేష్‌పై ఇప్పటికే ఈపూరుపాలెం, వేటపాలెం, చీరాల వన్‌టౌన్‌తో పాటు తెలంగాణలో కూడా పలు కేసులు ఉన్నాయి. ఆయా పోలీసులకు ఇప్పటికే వాంటెడ్ నిందితుడు. ఈక్రమంలో ఇతడిని, ఇతనితో పాటు మరి కొందరిని పట్టుకునేందుకు శుక్రవారం రాత్రి తెలంగాణకు చెందిన పోలీసులు చీరాలకు వచ్చారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన పోలీసుల వాహనాలు కూడా శుక్రవారం రాత్రి వాడరేవు తీరం వైపు ఓ గెస్ట్ హౌస్ సమీపంలో తిరిగినట్లు సమాచారం ఉంది. ఇదిలావుండగా ఏమి జరిగిందో తెలియదు గానీ సుమారు ఏడు గంటల సమయం నుంచి ఇసుక దిబ్బల్లో మహేష్ రక్తపు వస్త్రాలతో పడుకుని తనపై ఈపూరుపాలెం ఎస్సై, వేటపాలెం ఎస్సైతో పాటు మరి ముఖ్యంగా ఐడీ పార్టీకి చెందిన వారు దాడిచేసి గాయపరిచారని చెప్తున్న వీడియో వైరల్ అయింది. అందులో మహేష్ ఎస్సైల పేర్లు మాత్రం చెప్పలేక పోయాడు.

పరారీకి పక్కా ప్లాన్

ఇదిలావుంటే ఇతడికి బాపట్ల వైద్యశాలలో ఎవరో చేర్పించి మరలా ప్రథమ చికిత్సను అందించి అక్కడా కూడా వీడియో తీసి వైరల్ చేశారు. అక్కడా కూడా మహేష్ అదే పేర్లను పదేపదే చెప్పాడు. చికిత్స



రక్తపు మరకలు అంటిన వస్త్రాలతో పాత నేరస్థుడు మహేష్



బాపట్ల ప్రభుత్వాసుపత్రి నుంచి పారిపోయే ముందు చికిత్స పొందుతున్న మహేష్

జరుగుతుండగానే మహేష్ అక్కడి వైద్యుల కళ్లుగప్పి పరారయ్యాడు. ఈనేపథ్యంలో వైరల్ అయిన రెండు వీడియోలతో ఒక్కసారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులతో పాటు మొత్తం నియోజకవర్గ పరిధిలోని పోలీసు వ్యవస్థ సైతం అవాక్కయింది. వీడియోలు తీసిన వ్యక్తి ఎవరు.. గాయపడిన మహేష్ ఎక్కడ.. అసలు ఈ ముగ్గురి పేర్లే ఎందుకు చెప్తున్నాడు వంటి వాటిపై పోలీసు అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే చికిత్స అందించిన వైద్య సిబ్బంది మాత్రం అతడి చొక్కాకు అంటిన మరకలకు శరీరంపై ఉన్న దెబ్బలకు పొంతన లేదని చెప్తున్నారు. అసలు అవి తగిలిన దెబ్బలా ? లేక సృష్టించిన దెబ్బలా? తెలియాలి. లేక నిజమైన దెబ్బలే అయితే గాయాలతో ఉన్న మహేష్ ఎక్కడున్నాడు? చికిత్స ఏమైంది? పరారయ్యేందుకు పక్కా ప్లాన్ వేశాడా అనే సందేహాలను పోలీసులు తేల్చాలి. పోలీసులు మాత్రం ఇతనిపై కేసులు ఉన్న నేపథ్యంలో ఏక్షణంలోనైనా అదుపులోకి తీసుకుంటామన్న ముందస్తు ఆలోచనతో అతనే ఈవిధంగా గాయాలు సృష్టించుకుని పరారైనట్లు పోలీసులు స్పష్టంగా చెప్తున్నారు. రెండు రోజులుగా చీరాలలో గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటన ఒకవైపు, మరో వైపు పోలీసులపై ఆరోపణలతో కూడిన వీడియోల వైరల్‌తో పోలీసులకు తల బొప్పి కట్టింది. అంతేకాకుండా మరో ముఖ్యమైన విషయమేమిటంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఎస్సైలు గవర్నర్ ప్రొటోకాల్‌లో ఉన్నట్లు అధికారులు స్పష్టంగా తెలిపారు. అయితే శనివారం సాయంత్రానికి ప్రశాంతంగా గవర్నర్ రెండు రోజుల పర్యటన ముగసింది. ఇక మహేష్ వీడియోలకు ఏ విధంగా ముగింపు పలుకుతారో చూడాలి.



మెట్ల మార్గం వెంబడి ఏర్పాటు చేసిన శంఖు, చక్రం, నామాలు, గరుత్మంతుడు, ఆంజనేయస్వామి వార్ల విగ్రహాలు

శింగరకొండపై శంఖు, చక్రం, నామాల ఏర్పాటు

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ కొండపై లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ముందు మెట్ల మార్గం పక్కన అద్దంకి పట్టణానికి నాగసూరి రామారావు, కుటుంబసభ్యులు శంఖు, చక్రం, నామంతో పాటు గరుత్మంతుడు, ఆంజనేయస్వామి సిమెంట్ విగ్రహాలను ఏర్పాటు చేయించారు. శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నరసింహ సుదర్శన యాగం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. కొండపై మెట్ల మార్గం వెంబడి ప్రత్యేక ఆకర్షగా ఉన్నాయి.

ముంపు గ్రామాల సమస్యలను పరిష్కరిస్తా

మంత్రి రవికుమార్

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామాల సమస్యలను పరిష్కరిస్తానని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అతి చిన్న గ్రామమైన తిమ్మారెడ్డిపాలెం పునరావాస కాలనీ సమస్యలను పరిష్కరించాలని మంత్రిని శుక్రవారం రాత్రి విజయవాడలో గ్రామస్థులు కలిసి కోరారు. ప్రధానంగా పునరావాసకాలనీలో ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన వాటర్ ట్యాంక్, విద్యుత్‌ను కూడా ఏర్పాటు చేయలేదని రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. గ్రామస్థులు చందలూరి రామాంజనేయులు, బత్తుల సురేష్, హరిబాబు, మోహనరావు, గాలి నారాయణ, గన్నమనేని వెంకటనారాయణ, వీరనారాయణ, చందలూరి వెంకటరావు, హరిబాబు తదితరులు మంత్రి రవికుమార్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

నేడు మంత్రి పర్యటన వివరాలు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు చిలకలూరిపేటలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. 11 గంటలకు అద్దంకి మండలం కలవకూరు, 11-30 గంటలకు పంగులూరు మండలం ముప్పవరంలో జరిగే కార్యక్రమాలకు మంత్రి రవికుమార్ హాజరుకానున్నారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ఉండవల్లిలో ఉంటారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న



చీరాల ఏరియా వైద్యశాలలో అన్నదానం చేస్తున్న సూపరింటెండెంట్ సుభాషిణి, దాతలు

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి అన్నారు. శనివారం ఈపూరుపాలెంకు చెందిన బూదాటి సాంబశివరావు, నాగలక్ష్మి దంపతులు కుమారుడు జగదీష్ పుట్టిన రోజు సందర్భంగా హాస్పిటల్లో రోగులకు, అటెండర్‌లకు సుమారు 120 మందికి అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాస్పిటల్ సూపరిండెంట్ డా.సుభాషిణి పాల్గొని అందరికి ఒడ్డన చేశారు. దాతలు శుభకార్యాలప్పుడు వ్యయాన్ని వృథా చేయకుండా అన్నదానాలు నిర్వహించడం అభినందించదగిన అంశమని కొనియాడారు. కార్యక్రమంలో పూరమస్తాన్‌రావు, చైతన్య మనో వికాసం ప్రతినిధి వెంకన్నబాబు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు నుంచి జ్ఞాపికను అందుకుంటున్న ఏపీఎం జ్యోతి ప్రసాద్

పంగులూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో శ్రీనిధి రుణాల మంజూరు, రికవరీలో ఉత్తమ ఫలితాలు సాధించిన జె.పంగులూరు వెలుగు సిబ్బందిని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు అభినందించారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎం జ్యోతి ప్రసాద్‌కు జ్ఞాపికను ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో సీసీలు సాల్మన్, చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

గవినివారిపాలెం హైస్కూల్లో డిప్యూటీ ఈవో తనిఖీలు

- పలు వ్యత్యాసాల గుర్తింపు
- హెచ్‌ఎంకు మెమో



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో గంగాధర్

గవినివారిపాలెం(చీరాల), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గవినివారి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం డిప్యూటీ ఈవో గంగాధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పిల్లల అటెండెన్స్‌లో 12 మంది వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే స్టాఫ్ రివ్యూ మీటింగ్, ఆపార్ ఐడీ సమస్యల రికార్డులు సక్రమంగా లేకపోవడంతో తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈక్రమంలో ప్రధానోపాధ్యాయునికి మెమో జారీ చేస్తున్నట్లు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాయపాలెం శివారు ప్రాంతంలో పేకాట శిబిరంలో శనివారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.2వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవితేజ తెలిపారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

మార్టూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కోలలపూడి అంగనవాడీ కేంద్రంలో సూపర్ వైజరు కే పద్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమం తం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎంసతీష్ కుమార్,అంగనవాడీ టీచర్లు కవిత, సువర్ణలత, పద్మ, సుధ పాల్గొన్నారు.

నేత్రాల దానం

ఇంకొల్లు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో నేత్రదానం జరిగింది. గొనసపూడి గ్రామానికి చెందిన విక్రం సరస్వతమ్మ శుక్రవారం మృతి చెందగా కుటుంబ సభ్యులు వెంకట్రావు, నారాయణ, అజయ్‌బాబు, సందీప్ సహకారంతో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఆమె నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు రామ్మోహనరావు, జెట్టి స్వామి అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినుల సత్తా

చినగంజాం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు ఇంటర్‌లో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 33 మంది పరీక్షలు రాయగా, 28 మంది పాసై 84.8 శాతం, సీనియర్ ఎంపీసీలో 31 మందికి గాను 29 మంది ఉత్తీర్ణతతో 93.5శాతం సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఎంపీసీలో డి.దీప్తి 940, మౌనికాంజలి 935, కావ్య 900, మొదటి ఎంపీసీలో జె.హర్షిత 448, జి.అభినయ 439, .సాయిపూజిత 429, వి.ధరణి 424, వై.సౌమ్య 420, నాగమణి 412, రసజ్ఞ 407, చినమాధురి 405, రుక్మిణి 404 మార్కులు సాధించినట్లు తెలిపారు.

భూమన కరుణాకరరెడ్డివి అసత్యప్రచారాలు

- టీటీడీ గో మరణాలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- ఖండించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి టీటీడీ గో మరణాలపై అసత్య ప్రచారాలు చేస్తూ మత విద్వేషాలకు రెచ్చగొడుతూ ప్రజల మనో భావాలను దెబ్బతీస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఇటీవల భూమన చేసిన వ్యాఖ్యలపై శనివారం ఎమ్మెల్యే స్పందించారు. గోశాలలో 100 గోవులు మృతి చెందినట్లు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. భూమన మీడియాలో ప్రదర్శించిన ఫొటోలు తిరుమలలోవి కావన్నారు. భూమన కొవిడ్‌లో సైతం స్వామి ప్రసాదాలు దారి మళ్లించి పాపం మూట గట్టుకున్నారని ఆరోపించారు. మతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తిరుమల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే కొండ య్య ఓ ప్రకటనలో తెలిపారు.

విజయ ఢంకా మోగించిన శ్రీ గౌతమి కళాశాల



యోగనాథ్ 988



జయదుర్గ 988



చంద్రిక 434

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సీనియర్, జూనియర్ ఇంటర్ ఫలితాల్లో చీరాల శ్రీ గౌతమి కళాశాల విజయ ఢంకా మోగించింది. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ విద్యార్థులు యోగానంద్, జయదుర్గ 988 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కార్తీక్ 987, యామిని 985 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో చంద్రిక 434, స్నేహిత 433 మార్కులు సాధించారు. ఎంపీసీలో సాహితి, పూర్ణ పృధ్వి 465, చంద్రిక గీతిక రిజ్వానా, చరిత, కౌషిత్ 464 మార్కులు పొందారు. దీంతో కళాశాల మేనేజింగ్ డైరక్టర్ ఎం.వెంకటేశ్వర్లు(ఎంవీ), అధ్యాపకులు, సిబ్బంది వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

డ్రీమ్జ్ విద్యార్థుల ప్రతిభ

ఇంకొల్లు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : శనివారం విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పూసపాడు అడ్డరోడ్డు డ్రీమ్జ్ విద్యా ర్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభకనబరిచినట్లు కళాశాల డైరెక్టర్ పేర్ని రాధాకృష్ణమూర్తి తెలిపారు. మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను పి.సాయిహర్షితరెడ్డి, బి.దీపక్‌రెడ్డి 465 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు జె.పావనిశ్రీ 989 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ప్రతిభ చూపిన విద్యార్థులు, అధ్యాపకులను పేర్ని రాధాకృష్ణమూర్తి అభినందించారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్, యువ నాయకుడు గౌరీఅమర్‌నాథ్

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రప్రదేశ్) : గొల్లపాలెంలోని మహాలక్ష్మి అమ్మవారు, గంగమ్మతల్లి అమ్మవార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్, యువ నాయకుడు గౌరీనాథ్ పాల్గొన్నారు. సమీపంలోని పోతురాజు స్వామికి జరిగిన వెండి తొడుగు ఉత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు ఘన స్వాగతం పలికారు. అర్చకులు ఆశీర్వ వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామివార్ల తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

ఉప్పుటూరు (పర్చూరు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలంలోని ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర, శ్రీచెన్నకేశవ స్వామివార్ల తిరునాళ్ళ వేడుకలు శనివారం భక్తులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లకు మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కోలాటం, భజన కార్యక్రమాలు, చింతామణి నాటిక, చిన్నారులచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేపట్టారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు, వంశం పారంపర్య అర్చకర్తల సారథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై మాల్యాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేసి పర్యవేక్షించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పర్చూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నేడు శంకర్ కంటి అసుపత్రి పెదకాకాని, చిన్నయ మిషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధ్వర్యంలోఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పాబోలు ఉదయభాస్కర్ శనివారం ప్రకటనలో తెలిపారు. విద్యా దాత పాబోలు రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన గవర్నర్ పర్యటన

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతుల రెండ్రోజుల పర్యటన శనివారంతో ప్రశాంతంగా ముగిసింది. వాడరేవు ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో శుక్ర, శనివారం బస చేసిన గవర్నర్‌ను శనివారం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం గవర్నర్‌ను సాయంత్రం అధికారులు సాదరంగా సాగనంపారు. ఆయన విజయవాడ రాజభవన్‌కు పయనమయ్యారు.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన

సీనియర్ విభాగంలో సత్తాచాటిన గుంటూరు జిల్లా గిత్తలు

ఉప్పుటూరు (పర్చూరు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోలు రాధా ఎడ్ల బలప్రదర్శన పోటీలు పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలో హోరాహోరీగా సాగుతున్నాయి. శ్రీ వేంకటేశ్వర చెన్నకేశవ స్వామివార్ల తిరునాళ్ల సందర్భంగా రెండు రోజుల పాటు (సీనియర్, జూనియర్ విభాగాల్లో) పోటీలకు ఏర్పాట్లు చేశారు. శనివారం జూనియర్ విభాగంలో నిర్వహించిన ఎడ్ల బల ప్రదర్శనలో ఆయా జిల్లాల నుంచి 18 జతల ఎడ్లు పోటీలో తలపడనున్నాయి. ఫ్లడ్ లైట్‌ల మధ్య పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. పెద్ద సెంఖ్యలో పశుపోషకులు, అభిమానులు తరలివచ్చారు. కమిటీ నిర్వహకులు ముప్పా అంజయ్య, కొమ్మనబోయిన రాఘవయ్య, కాల్వ అమర్‌నాథ్, వెల్లటూరి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఎడ్ల బల ప్రదర్శనలో తలపడుతున్న ఒంగోలు జాతి గిత్తలు

సీనియర్‌లో సత్తా చాటిన గుంటూరు జిల్లా ఎడ్లు

సీనియర్ విభాగంలో నిర్వహించిన పోటీలో గంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య ఎడ్లు 2728.1 అడుగు దూరం లాగి రాష్ట్ర స్థాయి పోటీలో మొదటి బహుమతి రూ.55,000 ను కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా, పగడంవారిపాలెంకు చెందిన వేద శ్రీలత ఎడ్లు 2552.5 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి రూ.35,000 కైవసం చేసుకున్నాయి. మూడవ బహుమతిని బాపట్ల జిల్లా, ఆవులదొడ్డి కొత్తపాలెం గ్రామానికి చెందిన సాయిదీపిక చౌదరి ఎడ్లు 2408.9 అడుగుల దూరం లాగి రూ.20,000 నగదును సొంతం చేసుకున్నాయి.

భగభగ .. వడగండ్ల వాన

- పలుచోట్ల 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదు
- సాయంత్రం చల్లబడి జల్లులు
- పీసీపల్లిలో వడగండ్ల వాన
- మరింతగా ఎండలు పెరిగే అవకాశం

ఒంగోలు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం భానుడు భగభగలాడాడు. ఈ ప్రాంతం, ఆ ప్రాంతం అని తేడా లేకుండా అన్నిచోట్ల ఎండలు మండిపోయాయి. పలుచోట్ల 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా అత్యధిక ప్రాంతాల్లో 40డిగ్రీలకు పైగా ఉన్నాయి. ఎండలకు తోడు వేడిగాలులు కూడా మొదలయ్యాయి. అదే సమయంలో సాయంత్రం సమయానికి వాతావరణం చల్లబడటంతోపాటు పలుచోట్ల జల్లులు కూడా పడ్డాయి. ఏకంగా పీసీపల్లి మండలంలో వడగండ్ల వాన కురిసింది. గత నెల ఆఖరు నుంచే జిల్లాలో ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. అయితే శనివారం ఒక్కసారిగా ఉష్ణోగ్రతల తీవ్రత పెరిగింది. ఉదయం 10గంటల నంచే ఎండ మండింది. అలా మధ్యాహ్నం 12 గంటలకే చాలాచోట్ల 39 నుంచి 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా సాయంత్రం 4 గంటల వరకు ఆ తీవ్రత కొనసాగింది. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల సమయంలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదయ్యాయి. మధ్యాహ్నం 12 గంటల సమయానికి రాష్ట్రంలో అత్యధికంగా మర్రిపూడి మండలం జువ్విగుంటలో 40.28 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా 1 గంట సమయంలో వైపాలెం మండలంలో గోళ్లవిడిపిలో రాష్ట్రంలో కెల్లా అత్యధికంగా 41.33 డిగ్రీలు నమోదైంది.

దరిమడుగులో 42.90 డిగ్రీలు

మధ్యాహ్నం 2 గంటల సమయంలో రాష్ట్రంలో ప్రభుత్వం ఉష్ణోగ్రతలు నమోదు చేసే 1,599 సెంటర్లలో 33చోట్ల 41 డిగ్రీలుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా అందులో ఐదు సెంటర్లు జిల్లాలోనే ఉన్నాయి. ఆ సమయంలో తర్లుపాడులో గరిష్ఠంగా 41.30 డిగ్రీలు నమోదైంది. సాయంత్రం ఐదు గంటల వరకు పలు ప్రాంతాల్లో ఇదే తరహాలో ఎండలు ఉండగా మార్కాపురం మండలంలోని దరిమడుగులో సాయంత్రం 4 గంటల తర్వాత కూడా 42.90 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం ఎండ తీవ్రతను తెలియజేస్తోంది. ఇక జిల్లా కేంద్రమైన ఒంగోలులోనూ శనివారం ఎండమండింది. ఈ సీజన్‌లో తొలిసారిగా శనివారం 41.80 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. శుక్రవారం కన్నా శనివారం ఏకంగా 4 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగానే కనిపించింది. ఇక ఎండలకు తోడు వేడిగాలులు కూడా జిల్లా అంతటా ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉండగా సాయంత్రం 4 గంటల సమయానికి కొన్ని ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది. మబ్బులు కమ్మి చల్లగాలులు వీయగా కొన్నిచోట్ల జల్లులు పడ్డాయి. పీసీపల్లి మండలంలో ఏకంగా వడగండ్ల వాన పడగా ఇతర ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. ఆదివారం నుంచి ఎండలు మరింత పెరిగే అవకాశం ఉంది.



కమ్మవారిపల్లిలో వేపచెట్టు విరిగిపడడంతో తెగిపోయిన విద్యుత్ తీగలు



శింగరకొండలో వైభవంగా లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో చైత్ర పౌర్ణమి, హనుమద్విజయోత్సవం సందర్భంగా శనివారం లక్ష తమల పాకుల పూజ వైభవంగా జరిగింది. సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. వేదపండితులు, పూజారులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకులతో ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలుగా చిలకలూరిపేటకు చెందిన డీఆర్ ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. శనివారం, హనుమద్విజయోత్సవము కలిసి రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ప్రసన్నాంజనేయున్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

నైట్ షెల్టర్‌లు కరువు

- అవస్థల్లో ప్రజలు
- రాత్రయితే గుండెల్లో గుబులు
- కునుకు కోసం కష్టాలు



పట్టణంలో రహదారి వెంబడి నిద్రిస్తున్న నిరాశ్రయులు

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఏళ్ల తరబడి నైట్ షెల్టర్‌ల నిర్వహణ అటకెక్కింది. ఇతర ప్రాంతాల నుంచి వివిధ రకాల పనులు నిమిత్తం వచ్చిన ప్రజలు, రోజంతా యాచన సాగించి విశ్రమించేందుకు తావులేని బిచ్చగాళ్లు రాత్రి వేళల్లో కాసింత కునుకు తీసే పరిస్థితి లేక బతుకు జీవుడా అంటున్నారు. వర్షాకాలంలో తడుస్తూ, విడి రోజుల్లో దోమలతో రాత్రంతా జాగారం చేస్తున్నారు. గతంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని చర్చించి తీర్మానం చేశారు. ఈనేపథ్యంలో ముందు ఒక ప్రదేశం, తరువాత మరో ప్రదేశాన్ని షెల్టర్ ఏర్పాటుకు పరిశీలించారు. అయితే ఆ ప్రాంతాల్లోని ఇరుగు పొరుగు వారు అభ్యంతరాలు తెలుపడంతో అది కాస్త అప్పట్లో వాయిదా పడింది. కాలక్రమేణా ఆ విషయాన్ని పాలకులు, అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారు. దీం తో ఇతర ప్రాంతాల నుంచి చీరాలకు వచ్చి రాత్రిళ్లు వాహన సౌకర్యం లేక ఇరుక్కుపోయిన వారు, యాచకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఈ సారైనా నైట్ షెల్టర్‌ల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య



నైట్ షెల్టర్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రపోజల్స్ పంపించాం. ఉన్నతాధికారుల ఉత్తర్యుల కోసం వేచి చూస్తున్నాం. వైలనంత త్వరగా షెల్టర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం.

- అబ్దుల్ రషీద్, చీరాల మునిసిపల్ కమిషనర్

వేసవి ముగిసే లోపు పంట కాలువలకు మరమ్మతులు

- వ్యవసాయం లాభసాటిగా మారుస్తాం
- వైసీపీ పాలనలో గుండ్లకమ్మలో ఇసుక దోపిడీ
- మంత్రి గొట్టిపాటి



రైతులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

బల్లికురవ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వేసవి ముగిసేలోపు పంట కాలువలను మరమ్మతులు చేయిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. శనివారం అయన నీటి సంఘాల అధ్యక్షులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని కూటమి ప్రభుత్వం రాగానే గుండ్లకమ్మ ప్రాజెక్టులో 3 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

గ్రామాల్లో ఉన్న సాగు నీటి మేజర్లు, పంట కాలవలను పూర్తి అభివృద్ధి చేయాలన్నారు. ఎక్కడా రైతులకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. వైసీపీ పాలకులు రైతులకు నీటిని అందించకుండా ఇసుక దోపిడీ కోసం గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయేలా చేశారని అయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాగానే పడి పోయిన గేటును ఏర్పాటు చేసి 20 లక్షల చేప పిల్లలను వేయించామని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలో నిరుపేదలకు జీవనోపాధి కల్పించామన్నారు. రానున్న వ్యవసాయ సీజన్ ప్రారంభం నాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకు వస్తామని తెలి పారు. రైతులు దగ్గర ఉండి కాలవల మర్మమ్మతు లను చేయించు కోవాలని మంత్రి కోరారు.

ఇంటర్‌లో ప్రభుత్వ కాలేజీల విద్యార్థుల ప్రతిభ

చీరాలకు జిల్లా స్థాయిలో మొదటి స్థానం

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరానికి సంబంధించిన ఫలితాలను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈక్రమంలో సీనియర్ ఇంటర్‌లో చీరాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె.ధాత్రి శ్రీ 975 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానం సొంతం చేసుకుంది. ఒకేషనల్ జనరల్ కోర్సులో అదే కళాశాలకు చెందిన బీ అనూష 977 సాధించి ఉత్తమంగా రాణించింది. ఈక్రమంలో చిన్నారులను పలువురు అభినందించారు.

అద్దంకిటౌన్ : అద్దంకిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎం. సంజనా 961, సీనియర్ బైపీసీలో స్వరూపరాణి 967 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి దేవి తెలిపారు. సీనియర్ ఎంపీసీలో 6 గురు, సీనియర్ బైపీసీలో 10 మంది 900 మందికి పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఎంపీసీలో పి.స్పందన 459, జూనియర్ బైపీసీలో గీత 428 సాధించినట్లు చెప్పారు.

బల్లికురవ : ఇంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించిన్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 73 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో నూరు శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు తెలిపారు. ప్రథమ ఎంపీసీ విభాగంలో షేక్ ముస్రీన్ 430 మార్కులు, బైపీసీలో కె.కుమారి 406 సీఈసీలో తరుణ్‌తేజ 356 సాధించా రు. సెకండ్ ఇంటర్ ఎంపీసీలో సరిత 912 మార్కులు, బైపీసీలో కరుణ 825, సీఈసీలో క్రాంతిపాల్ 849 మార్కులు సాధించారు. కస్తూర్బా గాంధీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థినులు 74 శా తం, సెకండ్ ఇయర్ 85 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ సరళకుమారి తెలిపారు.

పంగులూరు : బూదవాడ ఉన్నత పాఠశాల ప్లస్ టూలో సీనియర్ ఇంటర్ బైపీసీ విద్యార్థిని షేక్ షాదీజ 833 మార్కులు, మరో విద్యార్థిని నజ్మా వెయ్యికి 712 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 70 శాతం, జూనియర్ ఇంటర్‌లో 85 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మార్టూరు : ఇంటర్ ఫలితాల్లో మా ర్టూరులోని రాయల్ జూనియర్ కాలేజీకి చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థి ఎం పీసీ గ్రూపునకు చెందిన ఓబుల శెట్టి దిలీ ప్ 1000 మార్కులకు గాను 989 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానాన్ని పొందారు.అదేవిధంగా శ్రీహర్షిణి జూనియర్ కాలేజీకి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి హృదయబాబు ఎంపీసీలో 465 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానాన్ని సాధించాడు.

పర్చూరు : ఇంటర్‌లో బాలికలు సత్తా చాటారు. ప్రభుత్వ బీఏఆర్ అండ్ టీప కళాశాలకు చెందిన 38 మందికి గాను 21 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శేషకుమారి తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం



మార్టూరు శాఖ విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం

మార్టూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు శాఖ విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎంపిక శనివారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగింది. ఏకగ్రీవంగా జరిగిన కార్యవర్గం ఎంపికలో అధ్యక్షునిగా కొరిటాల రామారావు, ప్రధాన కార్యదర్శిగా మద్దుమాల శ్రీనివాస చిట్టిబాబు, కోశాధికారిగా పొందూరు దేవకి నందన వెంకటేశ్వర రావుతోపాటు 13 మంది కార్యవర్గసభ్యులును ఎంపికచేశారు. ఎన్నికల అధికారిగా యర్రగుంట కృష్ణమూర్తి, సహాయ ఎన్నికల అధికారిగా యూవీ గోపాలరావు, జిల్లా ఎన్నికల పరిశీలకులుగా టీ మురళీధర రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ 2 అధ్యక్షులు రావుల బాపయ్య, షేక్ కమాలుద్దీన్, కరణం లక్ష్మయ్య పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

బల్లికురవ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం గ్రామంలోని వీర బ్రహ్మేంద్రస్వామి వార్షిక కల్యాణం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు దేవాలయం వద్ద కల్యాణ వేడుకలను నిర్వహించారు. కల్యాణం నిర్వహించే పురోహితులు వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్ర ప్రకారం జరిపించారు. ఈసందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు.

వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రవికుమార్



చినగంజాం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొనసపూడి గ్రామానికి చెందిన మాచవరపు రవికుమార్ వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శగా నియమితులయ్యారు. వైసీపీ అధినేత, జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ స్థానం కల్పించినట్లు రవికుమార్ శనివారం తెలిపారు. గతంలో రాష్ట్ర కార్యదర్శిగా, పర్చూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పనిచేసినట్లు తెలిపారు. అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, బాపట్ల పార్లమెంట్ వైసీపీ ఇన్‌చార్జి నందిగం సురేష్, పర్చూరు నియోజనవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యకు రవికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

కుటుంబ కలహాలతో చేయి కోసుకున్న వ్యక్తి

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి చేయి కోసుకున్న ఘటనల అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గరటయ్య కాలనీకి చెందిన సంజీవరావు శనివారం చేయి కోసుకున్నాడు. 108 సిబ్బంది సంజీవరావును అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం సంజీవరావు కమతేశ్వరస్వామి దేవాలయం సమీపంలో నామ్ రోడ్డు వెంబడి పడుకొని ఉండడంతో స్థానికులు 108 కు సమాచారం అందించారు. వెళ్లి చూడగా సంజీవరావు కావడంతో 108 సిబ్బంది వెనుదిరిగి వచ్చారు.

రైలు ఢీకొని వివాహిత మృతి

ఈపూరుపాలెం (చీరాల), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాలు దాటుతున్న వివాహితను రైలు ఢీకొనడంతో ఆమె మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని ఈపూరుపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లావణ్య(27) చూడకుండా పట్టాలు దాటుతుంది. ఈక్రమంలో ప్రమాదానికి గురైంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి శనివారం పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఉరుసు వేడుకల వద్ద ఘర్షణ

ఇద్దరికి గాయాలు

మార్టూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కొణిదెన రోడ్‌లో ఉరుసు వేడుకలు జరుగుతున్న సమయంలో కొంతమంది వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగింది. 15 రోజుల కిందట మండలంలోని వలపర్లలో జరిగిన ఆంజనేయస్వామి తిరునాళ్ల సమయంలో వారి మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అప్పటి గొడవలను దృష్టిలో పెట్టుకొని మరలా వారు మార్టూరులో గొడవ పడినట్లు తెలిసింది. ఈ గొడవలో మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన షేక్ గాలిబ్‌షా, అనిల్ అనే ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి వారిని పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.. మార్టూరు గ్రామానికి చెందిన సుభాని, మణితోపాటు కొంతమంది వ్యక్తులు తమపై కర్రలతో, చెరుకు గడలతో దాడి చేసి గాయపరచినట్లు సాయంత్రం ఆస్పత్రి నుంచి వచ్చిన ఇద్దరు బాధితులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎం.శేషగిరి రావు విచారణ చేస్తున్నారు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	41	28.2
కావలి	39	27
ఆత్మకూరు	41	28
ఉదయగిరి	40	26
కందుకూరు	40	27



ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో 'నారాయణ' అధ్యాపక బృందం

ఇంటర్ ఫలితాల్లో మనోళ్ల హవా!

- రాష్ట్రస్థాయిలో సీనియర్లకు 5, జూనియర్లకు 7వ స్థానం
- గతేడాదికంటే మెరుగైన ఉత్తీర్ణత
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో అత్యుత్తమ ఫలితాలు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఒకేసారి విడుదల అయ్యాయి. ఈ రెండు విభాగాల్లోనూ ఉత్తమ స్థానాలు రాగా ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో 5వ స్థానం, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 7వ స్థానం దక్కింది. గత ఏడాది ప్రథమ సంవత్సరం విద్యార్థులు 69 శాతం ఉత్తీర్ణతతో 8వ స్థానంలో ఉన్న జిల్లా ఈ ఏడాది 4 శాతం ఉత్తీర్ణత పెరిగింది. అలాగే ద్వితీయ సంవత్సరంలో గత ఏడాది 81శాతంతో 6వ స్థానంలో ఉన్న జిల్లా ఈ ఏడాది 6శాతం ఉత్తీర్ణత పెరగడంతో 5వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 26,272 మంది పరీక్షకు హాజరు కాగా 19,282 మంది (73 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 22,720 మంది పరీక్షకు హాజరు కాగా 19,848 మంది (87 శాతం) ఉత్తీర్ణత పొందారు. కాగా, ఎప్పటిలాగే ఇంటర్ ఫలితాల్లో ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు.

మే 12 నుంచి సప్లిమెంటరీ..

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, బెటర్మెంట్ పరీక్షలను మే 12 నుంచి 20వ తేదీ వరకు రోజుకు రెండు సెషన్లలో నిర్వహిస్తున్నట్లు ఆర్ఐఓ డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. సంబంధిత తేదీల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఫెయిల్ అయిన విద్యార్థులతోపాటు ఇంప్రూవ్‌మెంట్ కోసం పరీక్షలు రాసేందుకు వీలు కల్పించినట్లు చెప్పారు. అలాగే ప్రాక్టికల్ పరీక్షలను మే 28 నుంచి జూన్ 1వతేదీ వరకు జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. గతంలో హాజరు కాలేని విద్యార్థుల కోసం జూన్ 4వ తేదీన నైతిక, మానవీయ విలువలపై పరీక్ష, 6వతేదీన పర్యావరణ విద్యకు సంబంధించిన పరీక్షలను ఆయా కళాశాలల్లోనే నిర్వహిస్తారన్నారు. రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ ఫీజులను సంబంధిత కళాశాలల్లో ఈ నెల 15 నుంచి 22వతేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఫలితాల్లో పొందిన మార్కులకు సంతృప్తి చెందని విద్యార్థులు రీ కౌంటింగ్‌కు ప్రతి పేపర్‌కు రూ.260, రీవెరిఫికేషన్‌కు ప్రతి పేపర్‌కు రూ.1300 చొప్పున ఫీజులను ఆన్‌లైన్‌లో ఈనెల 13 నుంచి 20వతేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఫెయిల్ అయిన, ఆశించిన మార్కులు పొందలేక పోయిన విద్యార్థులు ఎలాంటి నిరాశ, నిస్పృహలకు లోనుకావద్దని, పరీక్షల ద్వారా వాటిని సరిదిద్దుకోవచ్చన్నారు. ఇంటర్‌బోర్డు అండగా ఉంటుందని, తల్లిదండ్రులు కూడా వారిలో మనోధైరాన్ని నింపాలని తెలిపారు.

ఫెయిల్ అయ్యానని విద్యార్థి బలవన్మరణం

నెల్లూరురూరల్, ఏప్రిల్ 12, (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌లో ఫెయిల్ అయ్యానన్న బాధతో నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాలెంలో శనివారం ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. విశ్వసనీయ సమాచారం మేరకు.. స్థానిక ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థి నెల్లూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదట సంవత్సరం చదువుతున్నాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఎంపీసీలో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాడు. దీంతో క్షణికావేశానికి గురైన ఆ విద్యార్థి తన ఇంట్లోనే ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. కాసేపటికి కుటుంబ సభ్యులు వచ్చి చూడగా వేలాడుతున్న విద్యార్థిని హుటాహుటిన కిందకు దించి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మరణించినట్లు వైద్యులు తేల్చారు. కాగ ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

గురుకుల విద్యార్థినుల సత్తా

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలు విద్యార్థినులు సత్తా చాటారు. ముత్తుకూరు, పెద్దపావని, కోడూరు, కండలేరు, సంగం, బుచ్చిరెడ్డిపాలెంలో ఆరు గురుకుల కళాశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. కోడూరులో వి.ప్రవల్లిక, డి.భావన 986 మార్కుల, కండలేరుల జె.మేరీ 914, టి.వర్ధిని 850 మార్కులు సాధించారు. గురుకులాల ఇంటర్ ఫలితాలలో రాష్ట్రవ్యాప్తంగా వరుసగా నాల్గవ సారి జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. ఏపీఎస్‌డబ్ల్యూఈఆర్ఐ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ టి.పద్మ మాట్లాడుతూ మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

బీసీ సంక్షేమ శాఖ విద్యార్థులు..

జిల్లాలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాలల వసతి గృహాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 358 మందికిగాను 195 మంది విద్యార్థులు (54.47శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే రెండో సంవత్సరం విద్యార్థులు 250 మందికిగాను 233 మంది (83.21 శాతం) ఉత్తీర్ణత సాధించారు. వింజమూరులో ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహం విద్యార్థి జి.వెంకటసుశాంత్ 962 మార్కులు సాధించగా, కావలిలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహ జూనియర్ ఇంటర్ విద్యార్థిని పి.సుస్మిత 468 సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ అభినందనలు తెలిపారు.



బుచ్చి పెద్దూరు పురవీధుల్లో సాగుతున్న రథం

వేడుకగా కోదండరాముడి రథోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో శనివారం ఉదయం సీతా లక్ష్మణ సమేత కోదండరామ స్వామి రథంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ముందుగా ఆలయ పండితులు, అర్చకుల వేదమంత్రాలు, మంగళమేళాల నడుమ మోతకాపులు ఉత్సవర్లను రథంలో కొలువుదీర్చారు. అనంతరం ఆలయం నుంచి బయలుదేరిన రథం సన్నిధివీధి మీదుగా చెన్నూరు రోడ్డులోకి చేరుకుని ఆమార్గం మీదుగా శివాలయం వీధి, కోనేరు చుట్టూ తిరుగుతూ యథాస్థానానికి చేరుకుంది. ఈ ఉత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం జైశ్రీరాం, గోవింద నామస్మరణలు, కోలాట భజనలు, బాణా సంచాల మోతలతో పెద్దూరు మార్మోగింది. ఈ సందర్భంగా పలువురు దాతలు భక్తులకు మజ్జిగ, మంచినీరు, శీతలపానీయాలు అందజేశారు. అలాగే పులిహోర, పెరుగన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి, తహసీల్దారు వెంకటేశ్వర్లు, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు, ట్రైనింగ్ డీఎస్పీ శివప్రియ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. బుచ్చి సీఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. రాత్రి ఆలయ కోనేరులో సీతా, లక్ష్మణ సమేతుడిగా కోదండరామస్వామి తెప్పపై విహరించారు.



వైభవంగా సంగమేశ్వరుడి రథోత్సవం

సంగం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కామాక్షీదేవి సంగమేశ్వరస్వామి ఉత్సవర్లను రథంపై చేర్చిన అనంతరం వేదపండితులు పట్టువస్త్రాలు, గజ పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల కరతాళధ్వనుల నడుమ ఆలయం నుంచి రథం బయలుదేరింది. రెడ్డివారివీధి, ఆంజనేయస్వామివీధి, బజారువీధి, స్వామి వివేకానంద కూడలి, బండారుమిట్ట, శివాజీ సెంటర్, సత్రం కూడలి, ఆర్యవైశ్య బజార్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. రథం ముందు యువత కేరింతలు కొడుతూ భారత్‌మాతాకీ జై, హరహర మహాదేవ శంభోశంకర అంటూ నినాదాలు చేశారు. మహిళలు రథం కింద దూరి మొక్కులు తీర్చుకున్నారు. సంగంలోని వీధులన్నీ భక్తులతో పోటెత్తింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 420

రేపు అంబేడ్కర్ జయంతి

ఉలవపాడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న మండలంలోని చాకిచర్ల శ్రీశ్రీనగర్ ఎస్సీ కాలనీలో నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జీ ఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు జూటూరి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని దళిత, బహుజనులు, ముస్లిమైనారిటీలు, అంబేడ్కర్ సిద్ధాంతవాదులు, ప్రజాసామ్యవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

ఆగిన నీటి సరఫరా

లింగసముద్రం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో ఏర్పడిన విద్యుత్ అంతరాయంతో రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచి పోయింది.శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడగా, సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ఈ పథకం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో శనివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో, నీటి సరఫరా జరగలేదు.దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

న్యూస్ బాక్స్

వైభవంగా సీతారామ కల్యాణం



కల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులు

బిట్రగుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు యాదవ పాలెంలోని కోదండరామాలయంలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. మాజీ సర్పంచు దొడ్ల అంజయ్యయాదవ్-రమణమ్మ దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలను వారు అందచేశారు. వేదపండితులు శ్యాంసుధాకరచార్యులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. తదుపరి స్వామివారికి గజవాహనసేవ జరిగింది.

ప్రవేశాల గడువు పొడిగింపు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమీన్ ఉప్పలపాడు కేజీబీవీలో 11, 12వ తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు గడువును ఈ నెల 21 వరకు పొడిగించినట్లు ప్రత్యేకాధి కారిణి గోవర్ధిని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

480 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 531పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 480బేళ్లను కొనుగోలు చేశారు. నోబిడ్-43, జంపింగ్ లాట్స్-8 కారణాలతో 51బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.254.02గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

బిట్రగుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం రామస్వామిపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా శనివారం వాలీబాల్ పోటీలు జరిగాయి. సాయంత్రం బేతనీపేట - అంబేడ్కర్ యువసేన-2, సీఎల్ పురం - అంబేడ్కర్ యువసేన-1 జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. అంబేడ్కర్‌ను దైవంలా ఆరాధించే నీలం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో క్రీడాకారులకు పులిహోర, దద్ధోజనం, మిఠాయిలు అందచేశారు.

పామూరు సర్కిల్ అభివృద్ధిలో నిబంధనలు తూచ్ !

కందుకూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరురోడ్డు సర్కిల్ అభివృద్ధి పేరుతో జరుగుతున్న సర్వేలో మున్సిపల్ కమిషనర్, సర్వేయరు నిబంధనలు పాటించటం లేదని పలువురు స్థలాల యజమానులు విమర్శించారు. శనివారం సాయంత్రం సర్కిల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాదాల మోహనరావు, నాంచారయ్య, రవీంద్ర, మాదాల మాల్యాద్రి తదితరులు మాట్లాడుతూ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే అధికారులు సరైన సర్వే చేయకుండా అర్ధరాత్రి నోటీసులు ఇచ్చి ఆక్రమణలు తొలగించాలని చూస్తున్నారని, ఇదెక్కడి న్యాయమంటే మీరు ప్రజాప్రతినిధితో మాట్లాడుకోమంటున్నారని, షాడో ఎమ్మెల్యే తమను డబ్బు డిమాండ్ చేశారని ఆరోపించారు.

బుచ్చి విద్యార్థినికి ఉత్తమ మార్కులు

బుచ్చిరెడ్డిపాళెం,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచేడులో సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన శ్రీమేఘన ఇంటర్ ఎంపీసీలో 988 మార్కులు సాధించడంతో పలువురు ఆమెను అభినందించారు.

సిరిపురంలో తాగునీటి కష్టాలు!



సిరిపురం ఎస్సీ కాలనీలో నీటి కోసం చేతి పంపు వద్ద అవస్థ పడుతున్న మహిళలు



నీటి సరఫరా లేక అడుగంటిన సంపు

కావలి మండలం సిరిపురంలో వేసవి రాక ముందే తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంకు నుంచి నీటి సరఫరా నెల రోజుల నుంచి ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతోన్నాయి. తాగునీటి సరఫరా లేకపోవడంతో సిరిపురం ఎస్సీ, బీసీ, ఎస్టీ కాలనీ వాసులకు చేతి పంపులే దిక్కయ్యాయి. ఎస్సీ కాలనీలో చేతిపంపుల పైపులు దెబ్బతిని ఉండటంతో అరకొరగా వస్తున్న నీటితో మహిళలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి గ్రామంలో నీటి సరఫరా గంట మాత్రమే జరుగుతోంది. ఆ సమయంలో పైపులైన్లకు మోటార్లు బిగించి ఉండడం వల్ల అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా సక్రమంగా జరిగేది కాదు. దీంతో కూలి పనులకు వెళ్లి వచ్చి నీటి కోసం బోర్ల వద్దకు చేరి మహిళలు అవస్థ పడేవారు. ఇప్పుడైతే పూర్తిగా నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఇంకా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

- కావలి రూరల్,(ఆంధ్రజ్యోతి)

భూమన వ్యాఖ్యలు సహేతుకం కాదు : ఇంటూరి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తిరుమల గోశాలలో ఆవుల మృతిపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలు సహేతుకం కాదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భూమన హయాంలో టీటీడీ అవినీతి, కుంభకోణాలమయంగా మారినవిషయం జగద్విదితమని విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాదు, రెబ్బవరపు మాల్యాద్రి, వడ్డెళ్ల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

● చెక్కుల పంపిణీ

ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, కందుకూరుకి చెందిన 13మందికి వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 13.52 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

'అసత్య ప్రచారాలు తగదు'

కావలి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా గోశాలపై అసత్య ప్రచారాలు చేయడం తగదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గోమరణాలపై కరుణాకర్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కోటిమంది దేవతలకు సమానమైన గోమాతలపై దుష్ప్రచారం చేస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. కాబట్టి విమర్శలు చేసే ముందు ఆలోచించాలన్నారు.

ఇంటర్ ఫలితాల్లో కావలి విద్యార్థుల ప్రతిభ



కావలిటౌన్ : శ్రీచైతన్య కళాశాల ర్యాంకర్లను అభినందిస్తున్న యాజమాన్యం



అల్లూరు : విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల కరస్పాండెంట్ శివకుమార్, డైరెక్టర్ రహంతుల్లా



కావలిటౌన్ : శ్రీశ్రీనివాస కళాశాల విద్యార్థిని సోనియాసుల్తానాను అభినందిస్తున్న కరస్పాండెంట్ అశోక్



946 మార్కులు సాధించిన గీతాంజలి కళాశాల విద్యార్థిని రాజ్యలక్ష్మి

కావలిటౌన్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో కావలి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థిని కృష్ణసౌజన్య బైపీసీలో 988 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించింది. ధనుష్క బైపీసీ ఫస్ట్ ఈయర్‌లో 433మార్కులు సాధించి రాష్ట్ర ర్యాంకు సాధించింది. ఎంపీసీలో శివకృష్ణ 987, పీ జస్వంత్, హీనారుక్సర్ 986, బైపీసీలో నాగచందన 981, సీఈసీలో రజిత 944 మార్కులు సాధించారు. కరస్పాండెంట్ వెంకయ్య, ప్రిన్సిపాల్ లుకోధర్, డైరెక్టర్ పీవీఎస్ ప్రసాద్‌లు ర్యాంకర్లను, తల్లితండ్రులను శనివారం కళాశాలలో అభినందించారు.

● శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థిని సోనియాసుల్తానా ఎంపీసీలో 991మార్కులు సాధించి టౌన్‌ఫస్ట్ ర్యాంకు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో రీతుప్రియ, బీ చైతన్య 464మార్కులు, షణ్ముగలక్ష్మీ, వర్షిత, గీతాంజలిలు 463మార్కులు, చందన 462మార్కులు సాధించారు. కరస్పాండెంట్ బట్టేపాటి అశోక్, డైరెక్టర్లు ర్యాంకర్లను అభినందించారు.

● గీతాంజలి జూనియర్ కళాశాల విద్యార్థిని రాజ్యలక్ష్మి సీఈసీలో 946 మార్కులు సాధించి టౌన్‌ఫస్ట్‌గా నిలిచింది.

● శ్రీవశిష్ఠ జూనియర్ కళాశాల విద్యార్థిని లక్ష్మీహరిత ఎంపీసీలో 991మార్కులు, జూనియర్ ఇంటర్‌లో పూజిత చౌదరి 466 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

● శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రతిభ

అల్లూరు, ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో అల్లూరు మండలం నార్తుమోపూరు శ్రీచైతన్య విద్యాసంస్థలు ప్రతిభ కనబరిచాయి. కళాశాల విద్యార్థులు 89 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో కే. లక్ష్మీ జాగృతి 985 మార్కులు సాధించింది. బీ.పూజిత 984, ఓ.వైష్ణవి 984 మార్కులు సాధించారు. ఎక్కువ మంది విద్యార్థులు 900పైగా మార్కులు సాధించి ముందంజలో నిలిచారు. బైపీసీలో పీ.నందిని 980, యూ.జీవన్ కుమార్ 971, కేవీ శ్రీలక్ష్మీ 955 మార్కులు సాధించారు. అత్యధికులు 913పైగా మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఓ.హేమంత్ కుమార్ 459, బి.గౌతమి, ఎస్.మాధవి 456, టీ.వెంకట శరణ్య 455 మార్కులు సాధించారు. వీరందరిని కళాశాల కరస్పాండెంట్ శివకుమార్, డైరెక్టర్ ఖాజారంతుల్లాలతోపాటు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

● కందుకూరు విద్యార్థుల విజయదుందుభి

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో కందుకూరులోని వివిధ కళాశాలల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. అత్యధిక మార్కుల సాధనతోపాటు రాష్ట్రస్థాయి ర్యాంకర్లతో పోటీపడటం విశేషం. ఎంపీసీ విభాగంలో నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన షేక్ రైజ 990 మార్కులతో టౌన్ ఫస్ట్‌గా నిలవగా, ఆక్స్‌ఫర్డ్, శ్రీ గాయత్రీ, శ్రీప్రతిభ, శ్రీసాయిబాబా ఐఐటీ అండ్ జేఈఈ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. శ్రీ గాయత్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని తటవర్తి దుర్గాలక్ష్మీతులసి 989 మార్కులతో సత్తా చాటగా, ఆక్స్‌ఫర్డ్‌లో ఎస్కే జబీర్‌సుల్తాన్, పీ. మురళి 988 మార్కులు తేజశ్విని, హర్షిత, పార్థు, జాహ్నవి 987 మార్కులు సాధించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించటంతో ఆయా కళాశాలల్లో అభినందనల కార్యక్రమాలతో సందడి నెలకొంది. కందుకూరుకు చెందిన మండవ శ్రీరామ్ 466 మార్కులు సాధించి స్టేట్ రెండవ ర్యాంకర్‌గా నిలవటంతో అతన్ని పలువురు అభినందించారు.

● కొండాపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బీ.కావ్య ఎంపీసీలో 924 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ జయంతి తెలిపారు.

ప్రజల వద్దకే ప్రభుత్వం : ఎమ్మెల్యే దగుమాటి



వార్డు పర్యటనలో బోండాలు వేస్తున్న ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అధికారులు చుట్టూ తిరగకుండా ప్రజల వద్దకే ప్రభుత్వ అధికారులను తీసుకువచ్చి, సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. గడప గడపకు ఎమ్మెల్యే కార్యక్రమం శనివారం వెంగళరావునగర్‌లోని 25వవార్డులో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతి ఇంటి వెళుతూ సమస్యలను తెలుసుకుంటున్నారు. అనంతరం ఆ వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. చెత్త డబ్బాలు రోడ్డుపై పెట్టకుండా ఉండేలా ఐరన్ మెస్‌ను మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు.

కలిగిరిలో పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు



కలిగిరి : పోషకాహారం గురించి వివరిస్తున్న సూపర్‌వైజరు విజయలక్ష్మి

కలిగిరి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినఅన్నలూరు మెయిన్ అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అనారోగ్యాలు దరిచేరవని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసు ఎంఎస్‌కే నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు రమ శ్రీలత ఆయా సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో ఆ ఇంటి పురుషులు బాధ్యతలు తీసుకోవాలని పెదపవని సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజరు నీలాంబరి చెప్పారు.శనివారం మండలంలోని అన్నెబోయినపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పురుషులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలకు ఇంటి పనుల్లో పురుషులు సహాయం చేయాలని, కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): ముర్రుపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని కొండారెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహర మాసోత్సవాలు జరిగాయి. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధవరావు, కార్యకర్తలు రవణమ్మ, మల్లిక, గోవిందమ్మ, సుజాత, విజయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



వీవీ పాలెం : చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజరు సునీత

వక్ఫ్ బోర్డు బిల్లు రద్దు చేయాలి : సీపీఐ



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ శ్రేణులు

కందుకూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రం పార్లమెంట్ ఉభయసభల్లో పాస్ చేసిన వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని నియోజకవర్గ సీపీఐ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. అనంతరం నియోజకవర్గ కార్యదర్శి సురేష్‌బాబు మాట్లాడుతూ నూతన వక్ఫ్ బోర్డు బిల్లును వల్ల విలువైన భూములు బడా బాబులకు అప్పగించే కుట్రలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇలాంటి బిల్లును రద్దు చేసేవరకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై. ఆనంద మోహన్, జాషువా సాహితీ సంస్థ అధ్యక్షుడు ఎం. కిశోర్, ఆదినారాయణ, బాలబ్రహ్మాచారి, ఉప్పుటూరి మాధవరావు, కోటేశ్వరరావు, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

రోగాలకు కారకంగా ఒరవ కాలువ

● ప్రమాదంలో పట్టణ ప్రజల ఆరోగ్యం



కావలిటౌన్, మార్చి12(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని స్వచ్ఛతకు ఒరవ కాలువ పెద్ద గుదిబండగా మారింది. పట్టణం నడిబొడ్డులో సుమారు 18 అడుగుల వెడల్పు, 10 అడుగుల లోతులో ఒరవ కాలువ ట్రంకురోడ్డుతోసహా పట్టణ ప్రధాన ప్రాంతమంతా విస్తరించింది. దుర్భర వాతావరణం నెలకొనడంతోపాటు దుర్గంధం వెదజల్లుతూ ఈ ఒరవ కాలువ రోగాలకు నిలయంగా మారింది. కలుగోళమ్మపేట మీదుగా పెద్దపవని బస్టాండ్, ట్రంకురోడ్డు పొట్టి శ్రీరాములు విగ్రహం కూడలి, బిజిలి బజార్, 8వ వార్డు మొత్తం, హరిజనపాలెం, అరుంధతీపాలెంల మీదుగా పాపిరెడ్డి చెరువు వరకు ఒరవ కాలువ విస్తరించివుంది. తుమ్మలపెంట రోడ్డు వద్దనున్న చేపల మార్కెట్ వ్యర్థాలు. కాలువ వెంబడి ఉన్న చికెన్ షాపుల వ్యర్థాలతో పాటు కాలువ మొదలు చివరి వరకు డస్ట్‌బిన్‌గా డంపింగ్ యార్డుగా ఒరవ కాలువ మారింది. కాలువ వెంబడినున్న బ్రాందీ షాపుల వాటర్ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్ల కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, తినుబండారాల కవర్లు తదితర వ్యర్థాలతో కాలువ నిండిపోయి మురుగు ముందుకు ప్రవహించలేక నిలువ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. చనిపోయిన పందులు, కుక్కలు, కోళ్లు పందికుక్కలు తదితర కళేబరాలు కుళ్లి దుర్గంధం వెదజల్లడమేకాక కాలువ లోని వ్యర్థాలు తినేందుకు పందులు అందుల్లో పొర్లాడుతూ దుర్భర వాతావరణం నెలకొనడంతో పాటు దోమల ఉత్పత్తి కేంద్రంగా రోగాలకు కేర్ఆఫ్ అడ్రస్‌గా ఒరవ కాలువ మారింది.

● ప్రమాదంలో ప్రజల ఆరోగ్యం

పట్టణంలోని ఒరవ కాలువ దుర్భరంగా మారడం పందులు, దోమలతో విషజ్వరాలు, చర్మవ్యాధులు ప్రబలుతూ పట్టణ ప్రజల ఆరోగ్యం ప్రమాదభరితంగా మారింది. వ్యాధులు ప్రబలేందుకు దోమలు ప్రధాన కారణమన్న విషయం అందరికీ తెలిసిన విషయమే. ఒరవ కాలువ దోమల ఉత్పత్తి కేంద్రంగా మారి దోమ కాటుకు ప్రజలు గురవడంతో తరచూ రోగాల బారిన పడడం అసుపత్రుల పాలవడం షరామామూలుగా మారింది. దుర్గంధం భరించలేక ప్రజలు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు.

● పట్టించుకోని మున్సిపాలిటీ

పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన మున్సిపాలిటీ వారు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు పట్టించుకోకపోవడంతో పట్టణ ఆరోగ్యం ప్రమాదంలో పడింది. కావలి ఒరవ కాలువ దుస్థితి చూస్తే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కావలి అనే మాటలకు ఆనవాళ్లే కనిపించవు. తరచూ మున్సిపాలిటీవారు కాలువ శుద్ధి చేయాల్సివున్నా అటువంటి దాఖలాలు లేవు, కాలువలో దోమలు ఉత్పత్తి కాకుండా ఆయిల్ బాల్స్ వేయడం, మందులు పిచికారి చేయడం తదితర చర్యలు చేయాల్సి ఉన్నా అటువంటి దాఖలాలు లేవు. నిరంతరం ప్రజల ఆరోగ్య పరిస్థితులను గమనిస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవడం, ప్రజల్లో వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం వారిలో ఆరోగ్య చైతన్యం నింపడం లాంటి చర్యలు తీసుకోవాల్సిన పట్టణ ఆరోగ్య కేంద్రాలు నామమాత్రంగా పనిచేస్తున్నాయి. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయకపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

కలశ పునరుద్ధరణకు హోమాలు



మాలకొండలో హోమం చేస్తున్న వేద పండితులు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఇటీవల గాలిగోపురంపై ఉన్న ఐదు కలశాలలో ఒకటి విచ్ఛిన్నమైంది. దాన్ని పునరుద్ధరించేందుకు శనివారం ఆగమ పండితులు విక్కిరాల లక్ష్మీనరసింహచార్యులు, వేద పండితులతో కలిసి వాస్తు శాంతి, ఇతర హోమాలు నిర్వహించారు. అనంతరం కలశశుద్ధి, సంప్రోక్షణ నిర్వహించి, ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.వీ సాగర్‌బాబు, ఇతరు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండే ఎండ.. మగువా జాగ్రత్త!

● మహిళలపై భానుడి ప్రభావం ● అశ్రద్ధ చేస్తే అనారోగ్యమే!
● గర్భిణులు మరింత అప్రమత్తం ● కంటి, చర్మ వ్యాధులు సోకే అవకాశం
● ముందు జాగ్రత్తలతో సమ్మర్‌లో సేఫ్

ప్రస్తుతం భానుడి భగభగలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇప్పుడు 38, 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవు తోంది. రాబోవు రెండు నెలలు ఎండలు మరింతగా మండి పోతాయి. ఈ వేసవి ప్రభావం మహిళలపై ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మహిళల్లో రోగ నిరోధక శక్తికూడా తక్కువగా ఉండ డంతో త్వరగా నీరస పడటం, అలసటతో పనిచేయ లేకపోవడం, తగినంతగా ఆహారం తీసుకోలేక పోవడం, ఎక్కువ సేపు పడుకోవాలని పించడం వంటి సమస్యలు ఎదురవు తాయంటున్నారు. తగిన శ్రద్ధ తీసుకోక పోతే అనారోగ్యం పాలవుతారని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని మగువలం దరూ చర్మము, కళ్ల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం...

- నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి)



అమ్మలు చల్లగుండాలి

మిగిలిన వారి కన్నా ఎండ తీవ్రత ప్రభావం గర్భిణులపై ఎక్కువగా ఉంటుంది. శరీరంలో తేమ శాతాన్ని కాపాడుకుంటే వడదెబ్బ నుంచి ఉపస మనం పొందవచ్చు వారు వేసవి తపానికి గురైతే రక్తకణాలు కుచించుకుపోయి ఆ ప్రభావం కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం మీద తద్వారా గర్భస్థ శిశువుపైనా పడుతుంది. సాధారణ మహిళల కంటే గర్భం దాల్చిన వారిలో వేడి శాతం ఎక్కువగా ఉంటుంది. హార్మోన్ల మార్పులతో శరీరంలో వేడి ఆవిర్లు వారికి మరింత ఇబ్బంది కలిగిస్తాయి.

ఇలా చేస్తే మంచిది

- గర్భిణులు సాధ్యమైనంత వరకు ఎండలో బయటకు వెళ్లకుండా ఇంట్లోనే నీడపట్టున ఉండేలా చూసుకోవాలి.
- డీ హైడ్రేషన్‌కు గురికాకుండా పండ్లు, పండ్ల రసాలు, మంచినీరు తీసుకోవాలి.
- తల తిరిగినట్లు, తూలుతున్నట్లు అనిపిస్తే ఎక్కువ సేపు విశ్రాంతి తీసుకోవాలి.
- తరచూ గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే శరీరం తేలికపడుతుంది.
- గర్భిణుల్లో నీటి శాతం తగ్గడం వల్ల కాళ్ల వాపు వస్తుంటుంది. దీనిని నివారించాలంటే ఆహారంలో ఉప్పును తగ్గించుకోవాలి.
- వ్యాయామం చేసే సమయాన్ని మార్చుకోవాలి. తెల్లవారుజామున, సాయంత్రం సమయంలో వాతావరణం చల్లగా ఉన్నప్పుడు వ్యాయామం చేయాలి.
- వదులుగా, తేలికగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ముదురు రంగు దుస్తులు వాడితే అవి త్వరగా వేడిని గ్రహిస్తాయి అందుకని లేతరంగు బట్టలు ఎంచుకోవాలి.

కళ్లను కాపాడుకుందాం..

ముఖానికి సౌందర్యాన్ని ఇచ్చేవి నేత్రాలు. అటువంటి కళ్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత వేసవి తీవ్రత వల్ల నేత్ర సమస్యలు తలెత్తకుండా మహిళలు అప్రమత్తంగా ఉండాలి. సూర్య కిరణాలు నేరుగా కంటిపై పడితే ఆ తాపానికి కంటి లోని నరాలు దెబ్బతినే అవకాశం ఉంది. దీని వల్ల కళ్లు ఎర్రగా మారటం, మసకబారటం, చూపు మందగించడం, ఇతర నేత్ర సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది.

ఈ జాగ్రత్తలు పాటించాలి



- కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే శుభ్రమైన ఆహారం తీసుకుని ఎనిమిది గంటలు తగ్గకుండా నిద్రపోవాలి.
- చాలా మంది రాత్రిపూట నిద్రపట్టక బాధపడుతుం టారు. అలాంటి వారు పడుకునే ముందు ఒక లీటరు నీటిలో లిట్చస్ ఆకులు వేసి మరిగించి తాగితే నిద్ర వస్తుంది.
- వేసవిలో పొడి వాతావరణం వల్ల పెరిగిన దుమ్ము, తేమ వల్ల కళ్లల్లో ఎర్రదనం వస్తుంది. వీటితోపాటు కనురెప్పల మీద కురుపులు కూడా వస్తాయి. కాబట్టి కంటి మీద దుమ్ము నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- కళ్లల్లో తేమ త్వరగా కోల్పోతాం. దీనిని దృష్టిలో పెట్టుకుని తరచూ కళ్లను నీటితో కడుక్కోవాలి. బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా టోపీ, చలువ కళ్లద్దాలు వాడాలి.
- కంటి చుట్టు పక్కల ప్రదేశంలో గోకటంగానీ, రుద్దడంగానీ చేయరాదు.
- కంటి సమస్యలు ఎదురైతే వైద్యులను సంప్రదించాలి.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవి తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. గర్భిణీలు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎండదెబ్బ తగిలితే తీవ్ర అనారోగ్యానికి గురవుతారు. ఇది చాలా ప్రమాదకరం. డీహైడ్రేషన్‌కు గురైతే గర్భస్థ శిశువుకు కూడా ఇబ్బందే. ఎక్కువగా ద్రవ పదార్థాలను తీసుకోవాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉంటే మంచిది.

- డాక్టర్ బ్రిజిత, గైనకాలజిస్ట్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

చర్మ సంరక్షణ ముఖ్యం

మహిళల చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. అయితే ఎండాకాలంలో తీవ్రమైన వేడి, ఉక్కపోత, చెమట వల్ల చర్మ సమస్యలు ఉత్పన్నమవుతాయి. పొడి చర్మం కలిగిన వారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. చికాకు, దురద వంటి సమస్య లు తలెత్తుతాయి. కాళ్ల పగుళ్ల ఎక్కువవుతాయి. ఎండలో తిరగడం వల్ల బ్యాక్టీరియల్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లకు గురికావలసి వస్తుంది. దీనిని నిర్లక్ష్యం చేస్తే చర్మంపై పెద్ద పెద్ద పుండ్లు ఏర్పడుతాయి.

జాగ్రత్తలు ఇలా..



- ఎండ వేడిమికి ముఖంపై మొటి మలు మానిన తరువాత నల్లటి మచ్చలు ఏర్పడు తాయి. చర్మం నిగారింపు తగ్గు తుంది. ఇలాంటి వారు ముఖాన్ని తరుచుగా చన్నీటితో శుభ్రం చేసుకోవాలి.
- స్వేద గ్రంథులు ఎక్కువగా చెమటను విడుదల చేయడంతో చర్మంపై ఉండే పల్చటి పొర దెబ్బతింటుంది. దీనివల్ల నుదుటిపై, చంకల్లో, వీపు మీద, చర్మం ముడతలు పడే చోట ఎక్కువగా చెమట కాయలు ఉత్పన్నమవుతాయి. అందుకని తరచూ మెత్తటి వస్త్రంతో తుడుచుకుంటూ ఉండాలి.
- ఎక్కువ సేపు ఎండలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- నీటిని ఎక్కువగా తీసుకోవాలి. ద్రవాహారానికి ప్రాధాన్యమివ్వాలి.
- శరీర అవయువాలన్నీ శుభ్రంగా పొడిగా ఉండేలా రెండు పూటలా స్నానం చేయాలి.
- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చర్మానికి సన్‌స్క్రీన్ లోషన్ త ప్పకుండా రాసుకోవాలి

కంటి జాగ్రత్తలు తప్పనిసరి



వేసవి తీవ్రతకు నేత్రాలు దెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సూర్యుడి నుంచి వెలువడే అతినీల లోహిత కిరణాలు నేరుగా కళ్లమీద పడితే కళ్లకు ప్రమాదం, ఇలాంటి స్థితిలో సన్‌గ్లాస్ తప్పని సరిగా వాడాలి. లేదంటే చేతి రుమాలును చల్లటి నీళ్లలో ముంచి తరచూ కళ్లను అద్దుకోవాలి. దీంతో వేసవి ప్రభావం నుంచి బయట పడవచ్చు.

- డాక్టర్ శార్వాణి, కంటి వైద్య నిపుణులు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి

'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోవాలి

● ఉమ్మడి జిల్లాకు లక్ష యూనిట్ల మంజూరు ● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని దేవ దాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరు ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో లక్ష సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో నియోజక వర్గానికి 10వేల యూనిట్లను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. రెండు కిలోవాట్ల సోలార్ వ్యవస్థకు రూ.1.20 లక్షలు ఖర్చవుతుం దని, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. బీసీలకు కొంత సబ్సి డీ లభిస్తుందని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెలాఖరులో ఆత్మకూరులో మోగా జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. ఇందులో 30 కంపెనీలు పాల్గొంటున్నాయని, నిరుద్యోగ యువత సద్విని యోగం చేసుకోవాలని కోరారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి

రూ.47.84 లక్షల చెక్కుల పంపిణీ

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి 47 మం దికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.47.84 లక్షలకు చెక్కులు అందించారు. ఆత్మకూరు నియోజక వర్గంలో ఇప్పటి వరకు 183 కుటుంబాలకు రూ.2.22 కోట్లను సీఎం రిలీఫ్ ఫండ్ కింద అందచేశామని వెల్లడిం చారు. ఈ కార్యక్రమాల్లో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో అప్రమత్తంగా ఉండండి

● సామాన్యులకు ఇబ్బంది కలగకూడదు ● సీసీ కెమెరాల్లో పర్యవేక్షించాలి
● ఇన్‌చార్జి ఎస్పీ దామోదర్

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి): హనుమాన్ శోభాయాత్ర సమయంలో బందోబస్తు సిబ్బంది ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎస్పీ ఏఆర్ దమోదర్ ఆదేశించారు. శోభాయాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను శనివారం ఆయన పరిశీలిం చారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయం లో అధికారులతో సమావేశం నిర్వహించారు. శోభాయత్ర సాగే మార్గంలో చుట్టపక్కల పరిస్థితులను పరిశీలిస్తుండాలని సూచించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటారని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకోవా లని ఆదేశించారు. సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకూడదని హెచ్చరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిం చాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినా తెలియజేసేందుకు కంట్రోల్ రూం, పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ సమా వేశంలో అదనపు ఎస్పీ సౌజన్య, ఎస్పీ డీఎస్పీ శ్రీనివాస రావు, నగర డీఎస్పీ సింధుప్రియ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్పీ

మాలకొండలో రూ.30లకే టెంకాయ

దుకాణాల వద్ద టెంకాయలు కొనుగోలు చేస్తున్న భక్తులు



వలేటివారిపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల కొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం లో గత శనివారం దుకాణదారులు రూ. 100కు అమ్మిన టెంకాయను ఈ శనివారం రూ. 30కే విక్రయించినట్లు భక్తులు తెలిపారు. ఈనెల6న 'లక్ష్మీనర సింహ సన్నిధి, భక్తుల నిలువ దోపిడీ' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఆలయ అధికారులు స్పందించారు. దుకాణదారులందరికీ నోటీసులు జారీ చేశారు. వారం లోపల సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్, ఆలయ సిబ్బంది దుకాణాల ఎదుట నిలబడి అధిక రేట్లకు విక్రయిస్తు న్నారా... లేదా ? అని పరిశీలించారు. దీంతో ఈ శనివారం రూ.30కే టెంకాయను విక్రయించారు.

సెలవు దినమైనా రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ విజయరాణి

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ నెలా రెండో శనివారం సెలవు దినమైనా ఈ శనివారం జిల్లాలో దస్తావేజుల రిజిస్ట్రేష న్లు జరిగాయి. నెల్లూ రులోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లో స్లాట్ పద్ధతిలో 12 రిజిస్ట్రేషన్లు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు వంద రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. పౌర్ణమి తిథి కావ డంతో పలువురు రిజిస్ట్రేషన్‌కు ఆసక్తి చూపారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జోన్-3 పరిధిలోని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎంల పోస్టులకు తాత్కాలిక సీనియారిటీ జాబితా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీ రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబితాలో అభ్యంతరాలుంటే తగిన ఆధారాలతో ఈనెల 16వతేదీ లోపల డీఈవో కార్యాలయంలో అందించాలని కోరారు.



పోటీల్లో తలపడు తున్న క్రీడాకారులు

క్యారమ్ జిల్లా ర్యాంకింగ్ పోటీలు ప్రారంభం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని నెల్లూరు క్లబ్‌లో శనివారం ర్యాంకింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏపీ ట్రాన్స్‌కో విశ్రాంత సూపరింటెండెంట్ ఇంజనీర్ బీవీ శేషారెడ్డి అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా క్రీడాకారులు ఆలిండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో అన్నీ పోటీల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు క్లబ్ అధ్యక్షుడు వీరేపల్లి అశోక్‌కుమార్, కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, కోశాధికారి శ్రీహరిరెడ్డి, రంజీ క్రికెట్ మాజీ క్రీడాకారుడు మలిరెడ్డి కోటారెడ్డి, అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్.శ్రీమన్నారాయణ, వీఆర్ శ్రీధర్ పాల్గొన్నారు.

15న పీఎం అప్రంటీస్ మేళా

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఈనెల 15వతేదీన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పాసైన విద్యార్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంబంధిత తేదీలో ఉదయం 10 గంటలకు కళాశా లలో హాజరు కావాలన్నారు. జిల్లాలోని ప్రముఖ సంస్థలు నిర్వహించే ఈ మేళాలో పాల్గొని ఉద్యోగావకాశాలు పొందాలని కోరారు.

ఇంటర్‌లో ప్రైవేట్ కళాశాలల హవా!

● అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రైవేట్ కళాశాలలు హవా కనబరిచాయి. నెల్లూరులోని పలు కళాశాలలు వారి ఫలితాలను, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలను వెల్లడించాయి. నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు హవా సృష్టించారని జనరల్ మేనేజర్ వి.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో ఎస్‌కె. తన్వీర్, బి.సాధన 992, బైపీసీలో సీహెచ్.భవ్య 992 మార్కుల సాధించినట్లు తెలిపారు. జూనియ ర్ ఎంపీసీలో ఎం.దివ్య 467, ఎం.సంతోష్‌కుమార్, డి.ప్రణవి, మనస్వి, పావని, జి.భాగ్యశ్రీ, డిల్లిగ జేష్, ఎన్.కిరణ్‌తేజ, ఎం.గణేష్‌వర్ధన్, పి.హారి కలు 466 మార్కులు సాధిం చారన్నారు. బైపీసీలో 440 మార్కులకు ఎ.అ ద్వైత కార్తికేయిని, టి.తమన్వి త, సీహెచ్.మానస 435 సాధించారన్నారు. అలాగే ఎంపీసీలో 465కుపైగా 37 మంది, 460కుపైగా 383 మంది, బైసీపీలో 430కుపైగా 53 మంది ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో కోర్ డీన్ జయకుమార్‌రాయుడు, డీన్స్ వర్ధిని, మహేష్, రాజమహేష్‌రెడ్డి, కె.శ్రీనివాస్, డీజీఎం మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.



● 'విశ్వసాయి' విజయ దుందుభి

ఇంటర్ ఫలితాల్లో విశ్వసాయి కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆ కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో కె.హేమంత్‌రాఘవ 466 మార్కులు, ఎ.విజిత, సి.శివ మోక్షజ్ఞ, ఎ.హర్షసాయి, పి.లిఖిత 465, సి.శరణ్య, జి.జనార్ధన్, ఎన్.నిషిత, ఎన్.ప్రదీప్, కె.వెంకట ప్రణయ్ 464 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో 440 మార్కులకు షేక్.సాధిక 436, వై.వెంకట గ్రీష్మ, ఎన్.ధనుష్, ఎస్.వెంకట సునీహ, ఎస్.సాయి మహిక, షేక్.సైమాలు 435 మార్కులు సాధించారన్నారు. 430కిపైగా 45 మంది, 400కిపైగా 170 మంది ఫలితా లు సాధించారన్నారు. సీనియర్ ఎంపీసీలో పి.ప్రీతిక, ఎన్.గ్రీష్మారెడ్డిలు 988 మార్కులు, జి.లిఖిత 987, పి.అశ్రిత, కె.వెంకట రామిరెడ్డి, జి.చక్రధర్, వి.శిరీష, యు.కుశ్వంత్‌కుమార్ 986 మార్కులు సాధించారన్నారు. 980కిపైగా 38 మంది, 950కిపైగా 198 మంది, 900కి పైన 382 మంది ఫలితాలు సాధించారన్నారు. బైసీపీలో టి.ప్రియాంక 987 మార్కులు, కె.ఆయేషా 986, ఓ.శ్రావ్యారెడ్డి, షేక్.సమీర్, షేక్.రిజ్వాన్, ఎ.సంజనగ్రేస్, పి.ఫర్జాలు 985 మార్కులు సాధించారన్నారు. 980కిపైగా 20 మంది, 950కిపైగా 143 మంది, 900కిపైన 149 మంది ఉత్తమ ఫలి తాలు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను కళాశాల ఛైర్మన్‌తో పాటు వైస్‌ఛైర్మన్ జి. కృష్ణమోహన్, ఛైర్‌పర్సన్ రుక్మిణి అభినందించారు.



● ఫలితాల్లో డాక్టర్ కిషోర్స్ రత్నం ఘనత

ఇంటర్మీడియట్ ఫలితాల్లో డాక్టర్ కిషోర్స్ రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జూనియర్ ఎంపీసీలో వి.వన్షిక 466 మార్కులు, బివి.తేజేష్ 464, టి.సాయి పరిణిక, ఎం.రవి కిరణ్ 463 మార్కులు సాధించారన్నారు. 450కుపైగా 22 మంది ఫలి తాలు సాధించారన్నారు. బైపీసీలో ఆర్.కార్తీక మాధురి సింగ్ 434 మా ర్కులు, టి.లతాశ్రీ 433, ధీరజ్ 430 మార్కులు సాధించారన్నారు. 420కు పైగా 11 మంది ఫలితాలు సాధించారన్నారు. అలాగే సీనియర్ బైపీసీలో కె.శుశ్రిత 989, సి.జాహ్నవి 988 మార్కులు సాధించగా 950కు పైగా 10 మంది ఫలితాలు సాధించారన్నారు. ఎంపీసీలో డి.మునిసాయి రేవంత్ 987, పి.సాయివర్షిల్‌రెడ్డి 985 మార్కులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, అకడమిక్ అడ్వైజర్ నరసయ్య నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



● హవా చాటిన 'కృష్ణచైతన్య'

ఇంటర్ ఫలితాల్లో కృష్ణచైతన్య విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ.కృష్ణారెడ్డి తెలిపారు. నగరంలోని కళాశాలలో నిర్వహించిన అభి నందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జూనియర్ ఎంపీసీలో కె. స్వాతి శ్రీనిధి 465, షేక్.సోనియా 464, డి.స్పందన, ఎ.పవన్‌కుమార్, వి.వర్షిత, పిఆర్.లక్ష్మి 463 మార్కులు, సి.అంబిక సాయిచేతన, బిందుశ్రీలు 462 మార్కులు సాధించారన్నారు. ఎంఈసీలో 500లకు పి.కిరణ్‌కుమార్ 480, సీఈసీలో సుమన్ సోలంకి 478 సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో బివి.చరణ్‌రెడ్డి, ఎస్.శ్రావణి, 988, సీహెచ్.యశశ్విని, షేక్.గుల్‌షన్‌ఆరా 987, పఠాన్‌ఆయేషా, సుధాలాస్య, వై.శశిరేఖ 986 మార్కులు సాధించారన్నారు. బైసీపీలో కె.యామిని 989 మార్కులు సాధించిందన్నారు. మొత్తం మీద జూనియర్ ఎంపీసీలో 36 మంది 460 మార్కులకుపైన, 79 మంది450 మార్కులకుపైన సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



'ఓవెల్'లో అత్యుత్తమ మార్కులు

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఓవెల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ ఆర్.వేణు తెలిపా రు. కళాశాలలో శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ బైపీసీలో వై.నిహిత 990, వై.అమృత్‌రాజ్ 986, డి.పల్లవి 975 మార్కులు సాధించారన్నారు. ఎంపీసీలో ఎం.మోహనప్రియ 988, పి.రెడ్డిరుష్మిత 987, ఇ.కృష్ణవంశీ 984, కె.సౌమ్యప్రియ 983, దుర్గా హనుమత్ ప్రసాద్ 983, సిహెచ్.యశ్విత 981, డివి.నాగపవిత్ర 981, బి.అవినాష్ 980 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఎంపీసీలో ఎస్.స్ఫూర్తిక 466, జి.ఓమ్‌ప్రకాష్‌రెడ్డి, కె.శశాంక్ చౌదరి, బి.సాయి హర్షికిలు 465 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో ఎం.వెంకటేశ్వర్లురెడ్డి 434, వి.వెంకటలక్ష్మి 432, రోహన్‌సింగ్ 431 మార్కులు సాధించారన్నారు. ఎంఈసీలో టి.యశ్వంత్‌కుమార్ 478 మార్కులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ప్రమీల, జీఎం మహదేవ్, ఈడీ బాలు పాల్గొన్నారు.